
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

కర్నూలు
జిల్లా వార్తలు 5

గురువారం 6 మార్చి 2025



	ఇఫ్తార్	సెహరి
	గురువారం	శుక్రవారం
కర్నూలు	6: 29	5:19
నంద్యాల	6: 25	5:18

ఒక్క చాన్స్ ప్లీజ్..!


- ఎమ్మెల్సీ ఆశావహుల ప్రయత్నాలు
- మరోసారి అంటున్న బీటీ నాయుడు
- 'త్యాగధనుల' ముమ్మర ప్రయత్నాలు
- కర్నూలు జిల్లాకు మళ్లీ అవకాశం ఉంటుందా..?


మీనాక్షీనాయుడు


తిక్కారెడ్డి




ఆకెపోగు ప్రభాకర్


బీటీ నాయుడు

కర్నూలు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ కూటమి ఘన విజయం ఆ పార్టీల శ్రేణుల్లో ఉత్సాహం ఉరకలెత్తుతోంది. ఉత్తరాంధ్ర పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియ ముగియగానే.. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల నగారా మోగింది. ఐదు స్థానాల కోసం కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూలు కూడా విడుదల చేసింది. ఐదింటిలో ఒకటి జనసేన లేదా బీజేపీకి కేటాయించాల్సి వస్తుంది. టీడీపీకి దక్కే నాలుగు స్థానాలకు ఆ పార్టీల్లో తీవ్రమైన పోటీ నెలకొంది. ఖాళీ అవుతున్న ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీల్లో కర్నూలు జిల్లాకు చెందిన ఎమ్మెల్సీ బీటీ నాయుడు ఒకరు. ఆయన పదవీ కాలం మార్చి 29న ముగుస్తుంది. ఆ స్థానంలో జిల్లాకు చెందిన నాయకులలో ఒకరికి అవకాశం ఇవ్వాలనే డిమాండ్ ఆ పార్టీలో బలపడుతుంది. టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జిల్లాకు అవకాశం ఇస్తారా..? రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర పోటీ నెలకొన్న దృష్ట్యా ప్రతిపక్షంలో ఉన్న సమయంలో నాటి వైసీపీ ప్రభుత్వం ఆగడాలను ఎదురొడ్డి పార్టీకి అండగా నిలిచిన వారికి ఇస్తారా..? అన్నది చర్చనీయాంశంగా మారింది. ఈ క్రమంలో 'మాపేరూ పరిశీలించండి.. ఒక్క చాన్స్ ప్లీజ్..' అంటూ జిల్లాకు చెందిన పలువురు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు.

● సీట్లు త్యాగం చేశాం.. పరిశీలించండి..!

టీడీపీ ప్రతిపక్షంలో ఉన్న 2019-24 వరకు ఆదోని టీడీపీ ఇన్‌చార్జిగా సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే కె.మీనాక్షినాయుడు, మంత్రాలయం ఇన్‌చార్జిగా ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పి.తిక్కారెడ్డి, కోడుమూరు ఇన్‌చార్జిగా జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకెపోగు ప్రభాకర్ కొనసాగారు. ఓ వైపు వైసీపీ ఆగడాలను ఎదురొడ్డి పార్టీ బలోపేతం కోసం తీవ్రంగా కష్టపడ్డారు. అధినేత చంద్రబాబు 2022 నవంబరు 17న బాదుడే బాదుడు కార్యక్రమంలో భాగంగా రోడ్‌షో నిర్వహించారు. ఆదోనిలో రోడ్‌షో ఉంటుందని 24 గంటల ముందే సమాచారం ఇచ్చానా.. మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు నాయకత్వంలో టీడీపీ శ్రేణులు వెల్లువెత్తారు. యువగళం పేరిట యువనేత నారా లోకేశ్ పాదయాత్రను సైతం సూపర్ సక్సెస్ చేశారు. అలాగే మంత్రాలయం ఇన్‌చార్జి పి.తిక్కారెడ్డి నాయకత్వంలో యువనేత లోకేశ్ చేపట్టిన యువగళం పాదయాత్ర దిగ్విజయం చేశారు. చంద్రబాబు సతీమణి చేపట్టిన నిజం గెలవాలి.. కార్యక్రమాన్ని సైతం దిగ్విజయం చేయడంలో తిక్కారెడ్డి కృషి ఉంది. కోడుమూరు నియోజకవర్గంలో యువగళం పాదయాత్ర, నిజం గెలవాలి.. కార్యక్రమాలను విజయవంతం చేయడంతో అప్పటి పార్టీ ఇన్‌చార్జి ఆకెపోగు ప్రభాకర్ కృషి చేశారు. 2024 ఎన్నికల్లో ఆయా నియోజకవర్గాల్లో వారికే టికెట్లు వస్తాయని ఆశించి భంగపడ్డారు. కూటమి ఒప్పందంలో ఆదోని టికెట్ బీజేపీకి ఇవ్వడంతో మీనాక్షినాయుడు, కర్నూలు ఎంపీ టికెట్ బీసీల్లో కురవలకు ఇవ్వడంతో.. జిల్లా అధికంగా ఉన్న వాల్మీకులకు వ్యతిరేకత రాకూడదని మంత్రాలయం టికెట్ వాల్మీకులకు ఇవ్వడంతో తిక్కారెడ్డి, రాజకీయ సమీకరణాల్లో ఆకెపోగు ప్రభాకర్ సీట్లు కోల్పోయారు. అధికారంలోకి రాగానే సముచిత స్థానం కల్పిస్తానని అధినేత చంద్రబాబు నాడు హామీ ఇచ్చారని ఆ పార్టీలు నేతలు అంటున్నారు. రెండు పర్యాయాలుగా భర్తీ చేసిన నామినేటెడ్ పదవుల్లో అవకాశం దక్కలేదు. జిల్లా నుంచి ఖాళీ అవుతున్న ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ అవకాశం కోసం తమ పేర్లు పరిశీలనలోకి తీసుకోవాలని కోరుతున్నారు.

● మరోసారి అవకాశం ప్లీజ్!

జిల్లా నుంచి ఇద్దరు ఎమ్మెల్సీలు ఉన్నారు. వారిలో ఒకరు స్థానిక సంస్థల కోటా నుంచి ఎంపికైన వైసీపీ ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్ కాగా.. ఎమ్మెల్యేల కోటా కింద ఎంపికైన టీడీపీ ఎమ్మెల్సీ బీటీ నాయుడు. జిల్లాలో బలమైన వాల్మీకి సామాజికవర్గం నుంచి చట్టసభల్లో టీడీపీ ఒకరు కూడా లేదు. దీంతో తనకు మరోసారి అవకాశం ఇవ్వాలని బీటీ నాయుడు కోరుతున్నారు. బీటీ నాయుడు కర్నూలు ఎంపీగా రెండు పర్యాయాలు పోటీ చేసి ఓటమి చెందారు. అధిష్ఠానం ఆదేశాల మేరకు వివిధ జిల్లాలు, నియోజకవర్గాల ఇన్‌చార్జిగా, జిల్లా పార్టీ అధ్యక్షుడిగా పార్టీకి సేవలు చేశారు.

ముడితేనే మ్యుటేషన్!

వైసీపీ ప్రభుత్వంలో అధికారుల అక్రమాలు అన్నీఇన్నీ కావు. అవినీతికి పాల్పడి రూ.కోట్లు సంపాందించుకున్నారు. కూటమి అధికారంలోకి వచ్చినప్పటికీ వారిలో మాత్రం మార్పు రాలేదు. ఇందుకు నిదర్శనమే కోడుమూరు తహసీల్దార్ కార్యాలయం. ఇక్కడ లంచం ఇస్తేనే పనులు జరుగుతాయన్న ఆరోపణలు పెద్దఎత్తున వినిపిస్తున్నాయి. కార్యాలయంలో ఓ అధికారి అవినీతికి అంతులేకుండా పోయిందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పనిని బట్టి ఆయనకు రూ.లక్షల్లో ముట్టజెప్పాల్సి వస్తోందన్న ప్రచారం జోరుగా సాగుతోంది. లేదంటే రోజుల తరబడి కార్యాలయం చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉంటుందని కొందరు బాధితులు పేర్కొంటున్నారు.

- తహసీల్దార్ కార్యాలయంలో లంచం ఇస్తేనే పని
- పనిని బట్టి డబ్బులు వసూలు
- కాసులు కురిపిస్తున్న భూ వివాదాలు
- ఐదు ఎకరాల భూ బదలాయింపునకు రూ.20 లక్షల డీల్
- గత ప్రభుత్వంలోనూ ఆయనపై అవినీతి ఆరోపణలు
- అప్పనంగా ప్రభుత్వ భూములను కట్టబెట్టారని విమర్శలు



కోడుమూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): వివాదాలు ఉన్న భూములు సదరు అధికారికి కాసుల వర్షం కురిపిస్తున్నాయి. కోర్టు కేసులను సైతం లెక్కచేయకుండా భూములను బదలాయిస్తున్నాడన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలోనే ఐదు ఎకరాల భూమిని ఇటీవల కాలంలో ఒకరి పేరు మీద బదలాయించడానికి ఆ అధికారి ఏకంగా రూ.20 లక్షలు తీసుకున్నట్లు తెలుస్తోంది. టీడీపీకి చెందిన మాజీ సర్పంచు 35 సెంట్ల భూమిని తన పేరు మీద ఎక్కించాలని అధికారులను సంప్రందిస్తే ఏకంగా రూ.5 లక్షలు డిమాండ్ చేసినట్లు తెలిసింది. అంతేగాకుండా మెరుగుదొడ్డి గ్రామంలోని మూడు ఎకరాల భూమిని ఒకరి పేరు మీద నుంచి మరొకరికి బదలాయించడానికి రూ.4 లక్షలు తీసుకున్నట్లు సమాచారం. ఇలా భూ వివాదాలు ఉన్న భూముల నుంచి రూ.లక్షలు దండుకుంటున్నారన్న ఆరోపణలు పెద్దఎత్తున ఉన్నాయి. ఈయన అవినీతిపై జిల్లా అంతటా చర్చ జరుగుతోందంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇదిలాఉంటే ఈయనకు ఆయన సామాజిక వర్గానికి చెందిన ఉన్నతాధికారుల అండదండలు ఉన్నాయని, అందుకే ఆయన అవినీతికి అంతులేకుండా పోయిందన్న విమర్శలు ఉన్నాయి.

రూ.కోట్లలో సంపాదన

వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈయన కర్నూలు మండలంలో పని చేశారు. అప్పట్లో వైసీపీ నేతలతో కలిసి భూ అక్రమాలకు పాల్పడి రూ.కోట్లలో ఆస్తులు కూడబెట్టినట్లు తెలిసింది. ఈయన సంపాందించిన ఆస్తులు మొత్తం బినామీ పేర్ల మీద ఉన్నట్లు సమాచారం. ముఖ్యంగా ఆయన సమీప బంధువులైన ఇద్దరు వ్యక్తుల పేరు మీద ఆస్తులు కొనుగోలు చేసి ఉంచినట్లు తెలుస్తోంది. వైసీపీ ప్రజాప్రతినిధులకు ప్రభుత్వ భూములను కట్టబెట్టి రూ.కోటీశ్వర్లను చేశారన్న వార్త అప్పట్లో పెద్ద దుమారం రేపింది. ఇద్దరి వైసీపీ నేతల ఇంటి నిర్మాణానికి ఈయన కావలసినంత డబ్బు సమకూర్చాడని కూడా ప్రచారం సాగింది. వైసీపీ నేతలకు ఇంటికి నిర్మాణానికి ఒక అధికారి డబ్బులు ఇవ్వడం అనేది జిల్లాలో అప్పట్లో సంచలనంగా మారింది. కూటమి అధికారంలోకి వచ్చిన అనంతరం కర్నూలు మండలంలో విధులు నిర్వహించేందుకు సహకరించాలని కూటమి నాయకులకు రూ.కోటి ఆఫర్ చేసినట్లు విశ్వసనీయ సమాచారం. చివరి వరకు కర్నూలు మండలంలోనే పోస్టింగ్ ఇప్పించుకోవడానికి ప్రయత్నించి విఫలమైనట్లు తెలిసింది. ఈయన పైన ఉన్న అవినీతి ఆరోపణల నేపథ్యంలో కర్నూలులో పని చేయడానికి అవకాశం ఇవ్వలేదని తెలుస్తోంది.

కర్నూలు మండలంలో పెద్ద ఎత్తున ప్రభుత్వ

సస్పెన్షన్ నుంచి తప్పించుకొని..

భూములను వైసీపీ నేతలకు దోచిపెట్టడమే కాకుండా ఇతను కూడా వాళ్ల బంధువుల పేర్ల మీద బదలాయించుకున్నాడు. గార్గేయపురం అటవీశాఖకు సంబంధించిన 16 ఎకరాల భూములు, బి.తాండ్రపాడు గంగమ్మ చెరువు, నిడ్జూరులోని బ్రాహ్మణ సామాజిక కులానికి చెందిన ఆరు ఎకరాల భూమి, నందనపల్లె పరిధిలోని చుక్కల భూముల విషయంలో వైసీపీ నాయకులతో చేతులు కలిపి అక్రమాలకు పాల్పడినట్టు తెలుస్తోంది. ఈయన అక్రమాలపై అప్పటి కలెక్టర్ సృజన రాష్ట్ర భూ పరిపాలన అధికారికి నివేదికను కూడా పంపించారు. అదే సమయంలో ఆమె బదిలీ కావడంతో కొంత మంది ఉన్నతాధికారుల దగ్గర సదరు అధికారికి ఉన్న పలుకుబడి ఉపయోగించి సస్పెన్షన్ నుంచి బయటపడినట్టు తెలిసింది.

2024 ఎన్నికల ప్రచారంలో భాగంగా కర్నూలు

ఎన్నికల ప్రచారంలో నారా లోకేశ్ వార్నింగ్

చెన్నమ్మ సర్కిల్లో నారా లోకేశ్ మాట్లాడుతూ ఈయన చేసిన అవినీతిని గురించి ప్రస్తావించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే అన్ని లెక్కలు తేలుస్తామని వార్నింగ్ ఇచ్చారు. కూటమి అధికారంలోకి వచ్చినప్పటికీ ఈయన అవినీతి ఆగడాలకు అడ్డుకట్ట వేయలేకపోతున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టి ఈయన అవినీతిని వెలుగులోకి తీసుకు రావాలని బాధితులు కోరుతున్నారు.



తహసీల్దార్ కార్యాలయంలో తీరని అన్యాయం జరిగింది



కోడుమూరు తహసీల్దార్ కార్యాలయంలో మా కుటుంబానికి తీరని అన్యాయం జరిగింది. మాది సొంత ఊరు లద్దగిరి మజరా గ్రామం రామాపురం. మాకు సంబంధించిన ఐదు ఎకరాల మిగులు భూమిని మూడు రోజుల కిందట మా బంధువుల పేరు మీద బదలాయించారు. ఈ భూవివాదం కోర్టులో ఉన్నప్పటికీ డబ్బుకు ఆశ పడి మా మాట వినకుండా మా పొలాన్ని అన్యాయంగా మాకు కాకుండా చేశారు. డబ్బు దండుకొని మాకు అన్యాయం చేసిన అధికారిపై న్యాయ పోరాటం చేయడంతోపాటు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకవెళ్తాం.

\- ప్రమీళమ్మ, బాధితురాలు

అవినీతి అధికారిని సస్పెండ్ చేయాలి



అక్రమంగా మా మూడు ఎకరాల పొలాన్ని ఇతరులకు ధారాదత్తం చేశాడు. ఇలాంటి అవినీతి అధికారులపై సమగ్ర విచారణ చేపట్టి సస్పెండ్ చేయాలి. ఇలాంటి అధికారిని ఇలాగే వదిలేస్తే ఉన్న ప్రభుత్వ భూములు కూడా మాయమవుతాయి. మాకు జరిగిన అన్యాయం గూర్చి అవ ంరావతికి వెళ్లి కూటమి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం. అంతేగాకుండా న్యాయ పోరాటానికి కూడా దిగుతాం.

\- వేణుగోపాల్,
మెరుగుదొడ్డి గ్రామం

ఇంటర్ పరీక్షలో ఏడుగురు డీబార్

● 328 మంది గైర్హాజర్

కర్నూలు ఎడ్యుకేషన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం విద్యార్థులకు బుధవారం జరిగిన పబ్లిక్ పరీక్షలో మాస్ కాపీయింగ్‌కు పాల్పడిన ఏడుగురి మీద మాల్ ప్రాక్టీసు కేసులు నమోదయ్యాయి. జిల్లాలో ఇంటర్ రెండో సంవత్సరం విద్యార్థులు 20496 మంది నమోదు చేసుకున్నారు. 20147 మంది పరీక్షలకు హాజరు కాగా, ఇందులో 328 మంది గైర్హాజరయ్యారు. మాస్ కాపీయింగ్‌కు పాల్పడి ఆలూరు ప్రభుత్వ జూనియర్ కాలేజీలో నలుగురు, ఆదోని సాయి జూనియర్ కాలేజీలో ఒకటి, ఆదోని అక్షర జూనియర్ కాలేజీలో ఒకటి, ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ జూనియర్ కాలేజీలో ఒకరు చొప్పున డీబార్ అయినట్లు ఆర్ఐవో ఎస్‌వీఎస్ గురువయ్యశెట్టి తెలిపారు. ఆర్ఐవో ఆధ్వర్యంలో డీవీఈవో పరమేశ్వరరెడ్డి, స్పెషల్ ఆఫీసర్ జి.లాలెప్ప, డీఈసీ కమిటీ సభ్యులు, స్క్వాడ్ బృందాలు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. అలాగే ఓపెన్ స్కూల్ ఇంటర్మీడియట్ రెండో రోజు పరీక్షలు జరిగాయి. జిల్లాలో ఇంటర్మీడియట్ విద్యార్థులు మొత్తం 1119 మంది దరఖాస్తులు చేసుకోగా 992 మంది పరీక్షకు హాజరయ్యారు. 122 మంది గైర్హాజరయ్యారు. ఒక విద్యార్థి మీద మాల్ ప్రాక్టీసు కింద కేసు నమోదు చేసినట్లు డీఈవో శామ్యూల్ పాల్ తెలిపారు.

స్టేట్ క్యాన్సర్ హాస్పిటల్‌లో 80 శాతం వైద్యసేవలు

● లీనార్ యాక్సిరేటర్ సేవలు ప్రారంభం



లీనార్ యాక్సిరేటర్ ద్వారా రోగికి రేడియోథెరపీ సేవలు ప్రారంభిస్తున్న డైరెక్టర్ డా.కృష్ణ ప్రకాష్

కర్నూలు హాస్పిటల్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): స్టేట్ క్యాన్సర్ హాస్పిటల్‌లో 80 శాతం వైద్యసేవలు అందుబాటులో వచ్చాయని కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ కె.చిట్టినరసమ్మ, క్యాన్సర్ హాస్పిటల్ డైరెక్టర్ కృష్ణ ప్రకాష్ వెల్లడించారు. క్యాన్సర్ చికిత్సకు రూ.39 కోట్ల విలువైన లీనార్ ఆక్సిరేటర్ మిషన్‌కు సంబంధించిన అటామిక్ ఎనర్జీ రెగ్యులేషన్ బోర్డు బొంబాయి నుంచి అనుమతి లభించిందని, దీంతో లీనార్ యాక్సిరేటర్ మిషన్ ద్వారా ఓ రోగికి రేడియేషన్ థెరపీ సేవలు ప్రారంభించినట్లు తెలిపారు. ఇప్పటికే మెడికల్ అంకాలజీ సేవలు ఉన్నాయని, అన్ని రకాల రేడియేషన్ థెరపీని గత రెండు రోజులుగా అందిస్తున్నామన్నారు. ఇప్పటికే ఓపీ, ఐపీ సేవలు అందుబాటులో ఉన్నాయని, ఆపరేషన్ థియేటర్ల పరికరాలు వస్తే త్వరలో ఓటీ సేవలు ప్రజలకు అందుబాటులోకి తెస్తామని చెప్పారు.

దీపం-2కు రూ.30.57 కోట్ల నగదు జమ

కర్నూలు కలెక్టరేట్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అర్హత కలిగిన దీపం-2 గ్యాస్ వినియోగదారులకు రూ.30,57,54,618 నగదు జమయ్యాయి. జిల్లాలో 4,72,851 గ్యాస్ కనెక్షన్లు ఉండగా.. దీపం-2కు 3,94,144 గ్యాస్ వినియోగదారులు దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో 3,89,304 మంది గ్యాస్ వినియోగదారులకు రాయితీ నగదు వారి ఖాతాలో జమ అయింది. లబ్ధిదారులకు 98 శాతం గ్యాస్ సబ్సిడీ అందింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తర్వాత కూటమి ప్రభుత్వం ఒక్కొక్కటి అమలు చేస్తోంది. దీనిలో భాగంగా దీపం-2 పథకం అమలుకు కూటమి ప్రభుత్వం దీపావళి నుంచి శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. కూటమి ప్రభుత్వం సంవత్సరానికి మూడు సిలిండర్లు ఉచితంగా ఇవ్వనుంది. మొదటి విడతలో భాగంగా మార్చి నెలాఖరుకు పూర్తి కానుంది. ఉచిత గ్యాస్ సిలిండర్ పొందడానికి లబ్ధిదారులు ఎల్‌పీజీ కనెక్షన్ ఉండాలి. తెల్లరేషన్‌కార్డు ఆధార్ కార్డుతో అనుసంధానమై ఉండాలి. నగదు జమ కాకపోతే 1967కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చు.

పర్యాటకులకు సౌకర్యాలే లక్ష్యం: కలెక్టర్



కర్నూలు కలెక్టరేట్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): పర్యాటకులకు శుభ్రత, సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా స్వచ్ఛతా గ్రీన్ లీఫ్ రేటింగ్‌ను ప్రకటిస్తున్నామని కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో స్వచ్ఛతా గ్రీన్ లీఫ్ రేటింగ్ (ఎస్‌జీఎల్ఆర్) సిస్టంపై అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో పర్యాటకులకు సౌకర్యాలు కల్పిస్తున్న హోటల్స్, రెస్టారెండ్లు, హోం స్టేలు, ధర్మశాలలు, లాడ్జీలకు స్వచ్ఛతా గ్రీన్ లీఫ్ రేటింగ్‌ను ప్రకటిస్తామని అన్నారు. ఆతిథ్య సంస్థల స్టేక్ హోల్డర్‌లకు ఈ సిస్టమ్ గురించి జిల్లా, డివిజనల్ స్థాయిలో వర్క్‌షాపు కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆర్‌డబ్ల్యూఎస్, టూరిజం, పంచాయతీ అధికారులను ఆదేశించారు. సమావేశంలో జడ్పీ సీఈవో నాసరరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ నాగేశ్వరరావు, జిల్లా పర్యాటక శాఖ అధికారి విజయ, డీపీవో భాస్కర్, ఏపీ టూరిజం కార్పొరేషన్ డిప్యూటీ మేనేజర్ సువర్ణ పాల్గొన్నారు.

నేరం.. బేరం..!

- కదులుతున్న ఖాకీల డొంక
- పోలీసులు శాఖలో ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్న అవినీతి అక్రమాలు
- కానిస్టేబుళ్లు, హోంగార్డులను అడ్డు పెట్టుకొని సీఐలు, ఎస్ఐల దోపిడీ
- ఉత్సవాల బందోబస్తు పేరుతోనూ వసూళ్లు
- పంచాయితీలకు అడ్డాగా మారిన పోలీస్ స్టేషన్లు



నంద్యాల, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాలో అవినీతి పోలీస్ అధికారుల్లో అలజడి మొదలైంది. కొందరు పోలీసులు నెలవారి మామూళ్లతో తమ జేబులు నింపుకోవడమే లక్ష్యంగా పని చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. కొందరైతే మరీ దారుణం. డబ్బులు తీసుకొని తప్పు చేసిన వారిపై కేసులు నమోదు చేయకుండా వదిలేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. దీంతో పోలీసు స్టేషన్లు పంచాయితీలకు అడ్డాగా మారాయన్న విమర్శలు పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి.

అవినీతి అక్రమాల్లో నంద్యాల జిల్లాకు చెందిన ఇద్దరు డీఎస్పీలు.. ఐదుగురు సీఐలే కాదు.. మరికొంత మంది కూడా ఉన్నట్టు తెలుస్తోంది. అక్రమ వసూళ్లతో పాటు మరికొందరు సీఐలు, ఎస్ఐలు వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. డోన్ సబ్ డివిజన్ పరిధిలోని ఓ సీఐ కింద పని చేస్తున్న ముగ్గురు ఎస్ఐలు తమదైన శైలిలో మట్కా, పేకాట, నాటుసారా, బెల్ట్ షాపుల నుంచి పెద్దఎత్తున మామూళ్లు తీసుకుంటున్నారని సమాచారం. ఆయా ఎస్ఐలు కానిస్టేబుళ్లతోపాటు హోంగార్డులను అడ్డుగా పెట్టుకొని ఆయా వర్గాల నుంచి వసూళ్లకు పాల్పడుతున్నారని తెలిసింది. అయితే సదరు సీఐకి తెలిసి జరుగుతోందా.. లేక సదరు ఎస్ఐ స్థాయిలోనే అక్రమ వసూళ్లకు తెరలేపారా.. అనే అనుమానాలు లేకపోలేదు. ఇదే సబ్ డివిజన్ పరిధిలోని మరో సీఐ, ఓ ఎస్ఐకి ఓ పేరుమోసిన పీడీఎస్ వ్యాపారి నుంచి నెలవారి మామూళ్ల రూపంలో నెలకు సీఐకి రూ.2 లక్షలు, ఎస్ఐకి - రూ.లక్ష, మరో అధికారికి రూ.లక్ష చొప్పున ముడుతున్నట్లు ఆ శాఖ వర్గాల నుంచి తెలిసింది. సదరు వ్యాపారిపై ఇప్పటికే 40 కేసులు నమోదయ్యాయని సమాచారం.

● మోనార్క్ డీఎస్పీపై మరిన్ని ఆరోపణలు...

ఇటీవల జరిగిన శ్రీశైలం బ్రహ్మోత్సవాల సమయంలో కూడా సదరు డీఎస్పీ అందిన కాడికి దోచుకోవడమే లక్ష్యంగా పని చేశారని తెలుస్తోంది. ప్రధానంగా సదరు డీఎస్పీ మంజూరు చేసిన సుమారు 400 వెహికల్ పాసుల విషయంలోనే సదరు డీఎస్పీ తమదైన శైలిలో చేతివాటం ప్రదర్శించారని సమాచారం. ఈ క్రమంలో అక్కడి సత్రాలు, దుకాణాలకు చెందిన వ్యాపారులతోపాటు తహసీల్దార్ సైతం పాసుల విషయంలో సదరు డీఎస్పీతో వాగ్వాదానికి దిగినట్లు తెలిసింది. సదరు డీఎస్పీ ఆఫీసుకు.. 12 కిలోమీటర్ల పరిధిలో ఉన్న ఓ మండలంలోని.. రెండు మద్యం దుకాణాల నుంచి మొదట రూ.80 వేల చొప్పున నెలకు రూ.1.60 లక్షల సదరు డీఎస్పీ తీసుకునే వారని సమాచారం. అయితే ప్రస్తుతం సదరు దుకాణాల నుంచి నెలకు రూ.1.20 లక్షలు మాత్రమే తీసుకుంటున్నట్లు తెలిసింది. ఒకవేళ ఇవ్వకపోతే సంబంధిత ఎస్ఐని రంగప్రవేశం చేయించి పలు రకాలుగా బెదిరించి వసూళ్లకు పాల్పడుతున్నారని సమాచారం. పీడీఎస్ బియ్యం వ్యాపారుల నుంచి నెలవారి మామూళ్లు తీసుకుంటున్నారని తెలిసింది. ఒక్కొక్కరితో నెలకు రూ.లక్ష చొప్పున సదరు డీఎస్పీ క్యాష్ చేసుకుంటున్నట్లు ఆశాఖ వర్గాల నుంచి తెలిసింది. ఇటీవల తాజాగా.. తమ సబ్ డివిజన్ పరిధిలోని రెండు మండలాలకు చెందిన బియ్యం వ్యాపారుల నుంచి రూ. 2 లక్షలు తీసుకున్నట్లు సమాచారం. ఈ వ్యవహారం బయటకు పొక్కకుండా తమ సిబ్బందిపై సదరు డీఎస్పీ బెదిరింపులకు దిగుతున్నారని తెలిసింది.

● నంద్యాల సబ్ డివిజన్‌కు పడమర దిశగా ఉన్న పోలీసుస్టేషన్‌లో పని చేస్తున్న ఓ సీఐ, ఎస్ఐపై పలు ఆరోపణలు ఊపందుకున్నాయి. సదరు మండల పరిధిలోని కంకర, మట్టి, క్వారీల నుంచి ఇతర ప్రాంతాలకు తరలించే టిప్పర్ల డబ్బులు వసూలు చేస్తున్నారు. ఒక్కో టిప్పర్ నుంచి రూ.5 వేల చొప్పున.. మొత్తంగా 50 టిప్పర్లకు కలిపి నెలకు.. రూ.2.50 లక్షలు వసూలు చేస్తున్నారని సమాచారం. ఈ వ్యవహారం అంతా కూడా సదరు సీఐ వద్ద పని చేస్తున్న ఓ కానిస్టేబుల్‌తో పాటు ఓ హోంగార్డు కనుసన్నుల్లో జరుగుతోందని సమాచారం. ఇక నాటుసారా విక్రేతల నుంచి సుమారు నెలకు.. రూ.1.50 లక్షలు, రెండు మద్యం దుకాణాల నుంచి నెలకు రూ.2 లక్షల చొప్పున వసూలు చేస్తున్నారని సమాచారం. వీటితోపాటు బెల్ట్‌షాపుల రూపంలో ఒక్కొక్క షాపు నుంచి రూ.25 వేల చొప్పున సుమారు రూ.2 లక్షల వరకు జేబులు నింపుకుంటున్నారని సమాచారం.

గత నెలలో తమ పరిధిలోని ఓ గ్రామంలో పట్టపగలే.. 5తులాలు బంగారు, రూ.50 వేలు నగదు చోరీకి గురైతే సదరు పోలీసులు ఇంత వరకు కేసు కూడా నమోదు చేయలేదని తెలిసింది. ఇదే తరహాలో మరో గ్రామంలో 8తులాల బంగారు, రూ.10 వేలు నగదు చోరీకి గురైతే ఇక్కడ కూడా కేసు నమోదు చేయలేదని తెలిసింది. మరీ దారుణం ఏమిటంటే.. సదరు స్టేషన్‌కు పక్కనే ఉన్న ఓ బ్యాంకు ఉద్యోగి బుల్లెట్ వాహనం సైతం ఏడాది కింద చోరీకి గురైనా పోలీసుల కేసు నమోదు చేయడం లేదని బాధిత ఉద్యోగి ఆవేదన వ్యక్తం చేయడం పలు విమర్శలకు తావిస్తోంది.

- మిగతా 6లో..



కల్యాణ వేడుకలో
శ్రీదేవి భూదేవి సమేత రంగనాథస్వామి వారు..

కల్యాణ వైభోగమే...

- ఘనంగా గోదా రంగనాథ స్వామి కల్యాణోత్సవం
- హాజరైన త్రిదండి అష్టాక్షరీ పీఠాధిపతి


కర్నూలు కల్చరల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): కర్నూలు నగర శివారు మామిదాలపాడులో వెలసిన గోదారంగనాథ స్వామి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. బుధవారం శ్రీదేవీ భూదేవీ సమేత రంగనాథ స్వామివారి కల్యాణోత్సవం కన్నుల పండువగా సాగింది. త్రిదండి అష్టాక్షరీ పీఠాధిపతి సంపత్కుమార రామానుజ జీయర్ స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో, ఆలయ వేద పండితులు రమేష్ భట్టార్, కిరణ్ భట్టార్, లక్ష్మీనారాయణాచార్యులు, మహేషాచార్యుల నేతృత్వంలో కల్యాణ వేడుకలను వేదమంత్రోచ్చారణల మధ్య నిర్వహించారు. వేకువజాము నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించగా ఉదయం 10:30 గంటలకు ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా పుష్పాలతో అలంకరింపజేసి, ఆలయ మండపంలో కల్యాణోత్సవం నిర్వహించారు. అనంతరం స్వామివారిని హనుమద్వాహనంపై ఉంచి మాడవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. సాయంత్రం నుంచి రాత్రి వరకు ప్రత్యేక పూజలు జరిగాయి. అనంతరం స్వామి,అమ్మవారు గరుడ వాహనంపై విహరించారు. మహిళల కోలాటాలు, భజనలు, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి గ్రామోత్సవం సాగింది. ఈ వేడుకలో ఆలయ వ్యవస్థాపక కమిటీ అధ్యక్షులు మారం నాగరాజ గుప్త, మేనేజింగ్ ట్రస్టీ పల్లెర్ల నాగరాజు, సభ్యులు పాలాది సుబ్రహ్మణ్యం, పెరుమాళ్ల బాలసుధాకర్, ఇటిక్యాల పుల్లయ్య, వేముల జనార్ధన్, లింగం క్రిష్ణయ్య శెట్టి, వేముల రవిప్రకాశ్, తల్లం సురేశ్‌బాబు, వేముల శివనాగప్రసాద్ పాల్గొన్నారు.



శ్రీదేవి, భూదేవి సమేత రంగనాథస్వామి వార్ల కల్యాణ వేడుకలను తిలకిస్తున్న భక్తులు

నేరం.. బేరం..!

(5వ పేజీ తరువాయి)



వీటితో పాటు బెల్ట్‌షాపుల రూపంలో ఒక్కొక్క షాపు నుంచి రూ.25 వేల చొప్పున సుమారు రూ.2 లక్షల వరకు జేబులు నింపుకుంటున్నారని సమాచారం. ఇంత పెద్దమొత్తంలో సంపాదన రావడంతో పోలీసు స్టేషన్ సేవలపై సదరు అధికారులు ఏమాత్రం దృష్టి పెట్టడం లేదని తెలుస్తోంది. కొన్ని సందర్భాల్లో కేసులు నమోదు చేయకుండా పంచాయితీలు చేసి ఇరువర్గాల నుంచి తవదైన శైలిలో సొమ్ము చేసుకుంటున్నారని సమాచారం. ఇదే క్రమంలో తమకు ఎలాంటి సమస్య తలెత్తకుండా అధికార పార్టీకి చెందిన నాయకులను అడ్డుగా పెట్టుకున్నారనే ప్రచారం ఉంది. గత నెలలో తమ పరిధిలోని ఓ గ్రామంలో పట్టపగలే.. 5తులాలు బంగారు, రూ.50 వేలు నగదు చోరీకి గురైతే సదరు పోలీసులు ఇంత వరకు కేసు కూడా నమోదు చేయలేదని తెలిసింది. ఇదే తరహాలో మరో గ్రామంలో 8తులాల బంగారు, రూ.10 వేలు నగదు చోరీకి గురైతే ఇక్కడ కూడా కేసు నమోదు చేయలేదని తెలిసింది. మరీ దారుణం ఏమిటంటే.. సదరు స్టేషన్‌కు పక్కనే ఉన్న ఓ బ్యాంకు ఉద్యోగి బుల్లెట్ వాహనం సైతం ఏడాది కింద చోరీకి గురైనా పోలీసుల కేసు నమోదు చేయడం లేదని బాధిత ఉద్యోగి ఆవేదన వ్యక్తం చేయడం పలు విమర్శలకు తావిస్తోంది. అక్రమ సంపాదన మోజులో పడి.. అసలు పోలీసు పని పక్కన పెట్టారనే విమర్శలు లేకపోలేదు. ఆయితే.. సదరు పరిధిలోని ఓ సోలార్ ప్లాంట్‌లో మాత్రం ఏ నిమిషం ఏం జరిగినా సదరు సీఐ, ఎస్‌ఐలు వెంటనే వాలిపోతారనే విమర్శలు అక్కడ లేకపోలేదు.


- నంద్యాల సబ్ డివిజన్‌కు 14 కిలోమీటర్ల దూరంలో ఓ మండల పోలీసుస్టేషన్‌లో 15 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. మూడు మద్యం దుకాణాలు మాత్రమే ఉన్నాయి. దీంతో ఆయా వ్యాపారులు మిగిలిన గ్రామాల్లో గుట్టుగా (బెల్ట్‌షాపు) మద్యం అక్రమ వ్యాపారం సాగిస్తున్నారు. తమ అక్రమ వ్యాపారాలకు అడ్డులేకుండా నెలవారి మామూళ్లతో పోలీసులకు సరిపెడుతున్నారని సమాచారం. ఈ వ్యవహారంలో ఇద్దరు కానిస్టేబుళ్లు కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిసింది.
- నంద్యాల సబ్ డివిజన్‌కు కూత వేటు దూరంలో ఉన్న.. ఓ మండల పోలీసు స్టేషన్ పని చేస్తున్న ఓ ఎస్‌ఐ గత దసరా పండుగ నేపథ్యంలో ఆయుధ పూజ పేరుతో.. సదరు మండల పరిధిలోని 20 గ్రామాలకు చెందిన నాయకులు, వ్యాపారుల నుంచి సుమారు రూ. 3 లక్షలు వసూలు చేసినట్లు సమాచారం. తమ పరిధిలోని ఓ గ్రామంలో ఓ వ్యక్తి తన భార్యను చంపితే.. సదరు కేసును కూడా ఆత్మహత్యగా చిత్రీకరించి సుమారు రూ. 50 వేలు బొక్కేశాడని తెలిసింది. సదరు ఎస్‌ఐ రోడ్డు ప్రమాదాల కేసుల్లోను తమదైన శైలిలో చేతివాటం ప్రదర్శించారని సమాచారం. ఇక పేకాటరాయుళ్ల నుంచి గుట్టుచప్పుడు కాకుండా ఓ హోంగార్డును పెట్టుకుని మరీ నెలవారీ మామూళ్లకు పాల్పడుతున్నారని ఆ శాఖ వర్గాల నుంచి తెలిసింది.
- ఆళ్లగడ్డ పరిధిలోని మరో సీఐ సైతం స్టేషన్‌కు వచ్చే బాధితులతో పంచాయితీలు చేయడం.. తమదైన శైలిలో ఇరువర్గాల నుంచి క్యాష్ చేసుకోవడమే లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని సమాచారం. ఇందుకు.. ఓ పంచాయతీ కార్యదర్శి తమ పరిధిలో జరిగిన ఓ అక్రమ వ్యవహారంపై పలుమార్లు ఫిర్యాదు చేసిన సదరు సీఐ కేసు కట్టనీయకుండా వ్యవహరించారని తెలిసింది. దీంతో చేసేదీ లేక సదరు పంచాయతీ కార్యదర్శి నేరుగా డీఎస్పీ, ఎస్పీకి కలిసి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో ఫిర్యాదు చేశారు. కానీ ఇప్పటి వరకు కేసు నమోదు చేయలేదు. ఎఫ్‌ఐఆర్‌కు నమోదు డబ్బులు డిమాండ్ చేసినట్లు తెలిసింది. ఇలా సదరు సీఐ తమదైన శైలిలో ఓ ప్రైవేట్ వ్యక్తిని మధ్యవర్తిగా పెట్టుకొని మరీ వసూళ్లకు పాల్పడుతున్నారని సమాచారం. కానిస్టేబుళ్లు, హోంగార్డులు సైతం బరితెగించి అక్రమ వసూళ్లకు బరితెగిస్తుండటం చర్చనీయాంశంగా మారింది.

జలవనరుల శాఖలో పదోన్నతులు

- జిల్లాలో ఇద్దరు ఎస్‌ఈలకు సీఈగా ప్రమోషన్
- కర్నూలు ప్రాజెక్ట్స్ సీఈగా కబీర్ బాషాకు రెగ్యులర్ పోస్టింగ్
- తిరుపతి టీడీపీ సీఈగా పదోన్నతిపై వరప్రసాద్ బదిలీ



షేక్ కబీర్ బాషా




ఏవీఎల్ఎన్ వరప్రసాద్

కర్నూలు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): జలవనరుల శాఖలో పలువురు ఎస్‌ఈలకు చీఫ్ ఇంజనీర్లు (సీఈ)గా పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కర్నూలు జిల్లాలో ఇద్దరు ఎస్‌ఈలు పదోన్నతి పొందారు. కర్నూలు జలవనరుల శాఖ ప్రాజెక్టు సీఈ అదనపు బాధ్యతలు (ఎఫ్‌ఏసీ) చూస్తున్న నంద్యాల ఎస్ఆర్‌బీసీ-1 సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ (ఎస్‌ఈ) షేక్ కబీర్ బాషాను సీఈగా పదోన్నతి ఇస్తూ ఇక్కడే రెగ్యులర్ పోస్టింగ్ కల్పించారు. ప్రకాశం జిల్లాకు చెందిన ఈయన బాపట్ల ఇంజనీరింగ్ కాలేజీలో సివిల్ ఇంజనీరింగ్‌లో బీటెక్ పూర్తి చేశారు. 1992లో ఏఈఈగా ఉద్యోగంలో చేరి నాగార్జునసాగర్ డ్యాంలో విధుల్లో చేరారు. 2006లో డీఈఈగా పదోన్నతిపై వినుకొండ క్వాలిటీ కంట్రోల్ డివిజన్‌లో చేరారు. 2019లో ఈఈగా... 2020 మేలో ఎస్‌ఈగా పదోన్నతి ఇచ్చారు. ఎస్ఆర్‌బీసీ సర్కిల్-1 ఎస్‌ఈగా పని చేస్తూ.. 2020 నుంచి కర్నూలు ప్రాజెక్ట్ సీఈగా ఇన్‌చార్జిగా కొనసాగుతున్నారు. సీఈగా పదోన్నతి ఇవ్వడమే కాకుండా అదే పోస్టులో రెగ్యులర్ చేశారు.

- **తిరుపతి టీజీపీ సీఈగా వరప్రసాద్**

హంద్రీనీవా ప్రాజెక్టు కర్నూలు సర్కిల్ ఎస్‌ఈగా పని చేస్తున్న ఎంఎల్ఎన్ వరప్రసాద్‌కు ప్రభుత్వం సీఈగా పదోన్నతి కల్పించింది. తిరుపతి తెలుగుగంగ ప్రాజెక్టు సీఈగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. నెల్లూరు జిల్లాకు చెందిన వరప్రసాద్ ఏఈఈ నుంచి ఎస్‌ఈ వరకు వివిధ హోదాల్లో ఆయా ప్రాజెక్టుల్లో పని చేశారు. సివిల్ ఇంజనీరింగ్‌లో బీటెక్ పూర్తి చేసిన తర్వాత ఏఈఈ ఉద్యోగంలో చేరారు. నంద్యాల టీజీపీలో తొలి సారిగా ఉద్యోగంలో చేరిన ఆయన 2002లో పదోన్నతిపై నందికొట్కూరు ఏబీఆర్ డివిజన్ డీఈఈగా బాధ్యతలు చేపట్టారు. 2016లో పదోన్నతిపై ఎస్ఆర్‌బీసీ పాణ్యం ఈఈగా, ఇన్‌చార్జిగా ఎస్‌ఈగా బాధ్యతలు నిర్వహించారు. ఈ ఏడాది జనవరిలో ఎస్‌ఈగా పదోన్నతిపై హంద్రీనీవా ప్రాజెక్టు కర్నూలు సర్కిల్ ఎస్‌ఈగా ప్రభుత్వం పోస్టింగ్ ఇచ్చింది. రెండు నెలలు గడవకనే సీఈగా పదోన్నతిపై తిరుపతికి బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించండి



కర్నూలు కలెక్టరేట్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మార్చి 8వ తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి కలెక్టర్‌ను ఆదేశించారు. మార్చి 8 నిర్వహణ ఏర్పాట్లపై బుధవారం రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎంపీలు, ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు, మహిళా ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో మహిళా సాధికారతను చాటేలా మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించాలని కలెక్టర్ రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు.

కల్లూరు సబ్ రిజిస్ట్రార్‌గా ప్రవీణ్‌కుమార్

కల్లూరు, మార్చి 5(ఆంధ్రజ్యోతి): కల్లూరు సబ్ రిజిస్ట్రార్‌గా బి.ప్రవీణ్‌కుమార్ నియామకమయ్యారు. స్టాంపులు రిజిస్ట్రేషన్ శాఖ ఐజీ ఆదేశాల మేరకు కర్నూలు డీఐజీ పీజీఎస్ కళ్యాణి బి.ప్రవీణ్‌కుమార్‌ను కల్లూరు సబ్ రిజిస్ట్రార్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాలు అందుకున్న ఆయన బుధవారం కల్లూరు సబ్ రిజిస్ట్రార్‌గా బాధ్యతలు స్వీకరించారు. కల్లూరు ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్‌గా పని చేసిన శ్రీనివాసరావు జిల్లా రిజిస్ట్రార్ ఆఫీసుకు వెళ్లారు.

నేడు రాఘవేంద్రుడి

430వ జన్మదిన వేడుకలు


- వేలాదిగా తరలిరానున్న భక్తులు
- నేటితో ముగియనున్న గురు వైభవోత్సవాలు

మంత్రాలయం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి):మంత్రాలయం రాఘవేంద్రస్వామి 430వ జన్మదిన వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. గురువారం రాఘవేంద్రస్వామి జన్మదినాన్ని పురస్కరించుకుని పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు రాఘవరాయడి బృందావనానికి సుప్రభాతం, నిర్మల విసర్జనం, క్షీరాభిషేకం, విశేష పంచామృతాభిషేకం నిర్వహించి సుందరంగా అలంకరించనున్నారు. టీటీడీ నుంచి వచ్చిన పట్టువస్త్రాలను స్వామివారిని అలంకరణ చేయనున్నారు. మఠం ప్రాంగణంలో చెన్నై నుంచి 20వ నాదాహార సమర్పణ సేవ చేయనున్నారు. దాదాపు 200 మంది సంగీత విద్వాంసులు ఏకధాటిగా నాదాహార సమర్పణలో పాల్గొననున్నారు. రాఘవేంద్రస్వామి గురు వైభవోత్సవాలు ముగియనున్న గురువారం రాత్రి యోగీంద్ర కళామండపంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.



టీటీడీ పట్టువస్త్రాలు తీసుకువస్తున్న టీటీడీ డిప్యూటీ ఈవో లోకనాథం

రాఘవరాయడికి విశేష పంచాభిషేకం



- తుంగా తీర వాసునికి భక్తుల నీరాజనాలు
- బృందావనానికి విశేష పుష్పాలంకరణ
- టీటీడీ నుంచి పట్టువస్త్రాల సమర్పణ
- ప్రహ్లాదరాయలకు పాద పూజ
- రథాలపై దర్శనమిచ్చిన ఉత్సవమూర్తి



మాట్లాడుతున్న పీఠాధిపతి

రాఘవరాయని మూల బృందావనానికి విశేష పంచామృతాభిషేకం చేశారు. గురు వైభవోత్సవాల్లో 5వ రోజు బుధవారం మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేసి హారతులు ఇచ్చారు. టీటీడీ డిప్యూటీ ఈవో లోకనాథం పట్టువస్త్రాలను తీసుకురాగా, మధ్వమార్గ్ కారిడార్ నుంచి మఠం ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్లు వెంకటేశ్ జోషి శ్రీపతాచార్ తదితరులు ఊరేగింపుగా శ్రీమఠానికి తీసుకువచ్చారు. పీఠాధిపతి మూలరాములకు బంగారు నాణేలతో అభిషేకించారు. ఈ కార్యక్రమంలో పండిత కేసరి విద్వాన్ రాజా ఎస్ గిరిరాజాచార్, ఆనందతీర్థాచార్, సుజీంద్రాచార్, గౌతమాచార్, ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్లు వెంకటేశ్ జోషి, శ్రీపతాచార్, వాదిరాజాచార్, రాజాఎస్ అప్రమేయాచార్ తదితరులు పాల్గొన్నారు. ఐదో రోజు యోగీంద్ర కళామండపంలో మక్తల్ కళాకారుల భరతనాట్యం భక్తులను అలరించింది.



రాఘవేంద్రస్వామి బృందావనం



మంచాలమ్మను అలంకరించిన దృశ్యం

ప్రముఖులకు అవార్డుల ప్రదానం

మంత్రాలయం రాఘవేంద్రస్వామి గురు వైభవోత్సవాల్లో 5వ రోజు బుధవారం రాత్రి యోగీంద్ర కళామంటపంలో ప్రముఖులకు పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు అవార్డులను ప్రదానం చేశారు. కర్నాటక దేవదాయ శాఖ కమిషనర్ ఎంవీ వెంకటేష్, ఢిల్లీ అవినీతి నిరోధక, ఆపరేషన్ కమిటీ జనరల్ సెక్రటరీ కృష్ణ మోహన్‌సింగ్, బెంగుళూరుకు చెందిన న్యూస్ 1 చానల్ ఎండీ రవికుమార్‌లకు ప్రశంస పత్రం, మెమెంటో, వెండి ప్లేటు, శేషవస్త్రం ఇచ్చి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఏఓ మాధవశెట్టి, మాజీ మేనేజర్ ఎస్‌కే శ్రీనివాసరావు, మేనేజర్లు వెంకటేష్‌జోషి, సురేష్ కోణాపూర్ తదితరులు పాల్గొన్నారు.



ఢిల్లీ అవినీతి నిరోధక మరియు ఆపరేషన్ కమిటీ జనరల్ సెక్రటరీ కృష్ణ మోహన్‌సింగ్‌కు అవార్డును అందజేస్తున్న పీఠాధిపతి



నృత్యం చేస్తున్న కళాకారులు

మన మిత్ర ద్వారా హాల్ టికెట్లు డౌన్ లోడ్

కర్నూలు ఎడ్యుకేషన్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): మొదటిసారి విద్యార్థులు వాట్సాప్ మనమిత్ర యాప్ ద్వారా ఎస్ఎస్‌సీ పబ్లిక్ పరీక్షల హాల్ టికెట్లను డౌన్‌లోడు చేసుకోవచ్చని జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ పాల్ బుధవారం తెలిపారు. వాట్సాప్ గవర్నెన్స్ మన మిత్ర ద్వారా హాల్ టికెట్లు డౌన్‌లోడు చేసుకునే విధానం వివరించినట్లు తెలిపారు. మార్చి 17 నుంచి 31వ తేదీ వరకు పదో తరగతి పరీక్షలు రెగ్యులర్, ఫెయిలైన విద్యార్థులకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

- పౌడర్, లిక్విడ్ రూపంలో తక్కువ ధరకే..

రైతులకు జీవ నియంత్రణ మందులు

కృషి



నంద్యాల ఎడ్యుకేషన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): నంద్యాల ఆచార్య ఎన్జీరంగా విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు రైతులకు తీపి కబురు అందజేశారు. భూమిలో రోగనిరోధకశక్తిని పెంచుతూ పంటకు హాని కల్గించే చీడ పీడ పురుగుల నివారణకు అత్యంత శక్తివంతమైన జీవ నియంత్రణ మందులను అందుబాటులోకి తీసుకరానున్నారు. అందుకు ప్రభుత్వం నుంచి తగిన నిధులు కూడా మంజూరయ్యాయి. మరో ఆరునెలల్లోనే రైతులకు మందులను అందుబాటులోకి తెస్తున్నట్లు ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

- **పౌడర్, లిక్విడ్ రూపంలో...**

రాష్ట్రీయ కృషి యోజనా పథకం ద్వారా బయో కంట్రోల్ ఏజన్సీ నుంచి రైజోబియమ్, ట్రైకోడెర్మా, సూడోమోనాస్ మందులను పౌడర్, లిక్విడ్ రూపంలో రానున్నాయి. పౌడర్ మూడు నెలల నుంచి ఆరునెలలు, లిక్విడ్ మూడు నెలలు మాత్రమే నిల్వవుండేలా నంద్యాలలోని ఆర్ఏఆర్ఎస్‌లోనే తయారు చేసి, తక్కువ ధరకే అందించనున్నారు.

- **విత్తన శుద్ధి విధానం:** ఎకరాకు విత్తనశుద్ధి కోసం పౌడర్ రూపంలో అయితే 10 గ్రాముల పౌడర్ కాని, లిక్విడ్ రూపంలో అయితే లీటర్ నీటికి 5 ఎంఎల్ కలిపి విత్తనశుద్ధి చేసుకోవచ్చు. పంటలకు డ్రిప్ ద్వారా కూడా అందించవచ్చు. పంటలకు ఎకరాకు వాడాలంటే 90కేజీల పశువుల ఎరువు, 10కేజీల వేపచెక్క, 2 కేజీల ట్రైకోడెర్మా పౌడర్ కలిపి 15 రోజుల పాటు మట్టితో కప్పిపెట్టి పంటలకు చల్లవచ్చు. ఇవి భూమిలో గడ్డకట్టిన పోషకాలను కరిగించి మొక్కకు అందజేస్తాయి. మొక్కలకు హానికల్గించే సూక్ష్మజీవులను నాశనం చేస్తాయి. ఆరోగ్యకరమైన, నాణ్యమైన పంటలను అందిస్తాయి.



- **ఆరు నెలల్లో రైతులకు అందుబాటులోకి తెస్తాం**



జీవనియంత్రణ మందుల తయారీకి ఇప్పటికే నంద్యాల ఆర్ఏఆర్ఎస్‌కు ప్రభుత్వం నుంచి రెండు కోట్లు మంజూరయ్యాయి. త్వరలోనే ప్రయోగశాల, తయారీ కేంద్రం, మిషనరీని ఏర్పాటుచేసి ఆరునెలలలోపే రైతులకు అందుబాటులోకి తీసుకొస్తాం. రైతులకు పరిశోధనా కేంద్రంలోనే కేజీ పౌడర్‌ను వంద రూపాయలకు, లీటర్ లిక్విడ్‌ను రూ.150కు విక్రయిస్తాం.

- డాక్టర్ ఎం. జాన్సన్, ఏడీఆర్, ఆర్ఏఆర్ఎస్, నంద్యాల

క్రీడాభివృద్ధికి కృషి చేస్తాం

రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్


క్రికెట్ ఆడుతున్న టీజీ వెంకటేశ్

కర్నూలు స్పోర్ట్స్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): క్రీడాభివృద్ధికి ఎల్లప్పుడూ కృషి చేస్తామని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ అన్నారు. బుధవారం స్థానిక ఎస్టీబీసీ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన బంగారుపేట ప్రీమియర్ లీగ్ సీజన్ 4 క్రికెట్ లీగ్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా టీజీ వెంకటేశ్ మాట్లాడు తూ క్రీడలతో శారీరక దృఢత్వంతోపాటు మానసిక ఉల్లాసం కూడా కల్గునన్నారు. బంగారుపేటకు చెందిన నీలి షీకారులు నిర్వహిస్తున్న బీపీసీఎల్ పోటీ లకు స్థానికులే కాకుండా మహారాష్ట్ర, కర్ణాటక వంటి ప్రాంతాల నుంచి క్రీడాకారులు కర్నూలు వచ్చి క్రీడల్లో పాల్గొనడం అభినందించదగ్గ విషయమన్నారు. టీజీ భరత్ ప్రీమియర్ లీగ్ పేరుతో కర్నూలు నగరంలో ఇలాగే తాము కూడా పోటీలు నిర్వహించి యువతకు ప్రోత్సాహకాన్ని అందిస్తామని ఆయన తెలిపారు. కార్యక్ర మంలో మాజీ కార్పొరేటర్ విఠ లశెట్టి, బంగారుపేట ప్రీమియర్ లీగ్ ఆర్గనైజర్లు సురేష్, శివ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యుత్ శాఖలో అభివృద్ధి పనులకు నిధులు

కల్లూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లా విద్యుత్‌శాఖలో పలు అభివృద్ధి పనులకు రూ.1.07 కోట్ల నిధులు మంజూరు అయినట్లు ఆ శాఖ ఎస్‌ఈ.ఎం. ఉమాపతి తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యుత్‌శాఖలో స్టోర్స్, సబ్‌స్టేషన్‌లో మరమ్మతు పనులు, సెక్షన్ ఆఫీసుల అధునికీకరణకు నిధులు మంజూరు అయ్యాయన్నారు. నాణ్యత ప్రమాణాలు పాటించి సకాలంలో పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఎస్‌ఈ సివిల్ సెక్షన్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈమేరకు సివిల్ సెక్షన్ ఏడీఈ కె.జగదీశ్వరరాయుడు ఇండోర్ స్టోర్స్‌లో ఒక షెడ్ ఏర్పాటుకు రూ.30 లక్షలు, అదేవిధంగా స్టోర్స్ వెనకభాగంలో వర్షపునీరు వెళ్లేలా డ్రైనేజీ నిర్మాణానికి రూ.16 లక్షలు మంజూరయ్యాయన్నారు. మామిదాలపాడు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో కంపౌండ్, ఫెన్సింగ్ నిర్మాణానికి రూ.9.5 లక్షలు, నంద్యాల జిల్లా గడివేముల నూతన సెక్షన్ కార్యాలయ భవన నిర్మాణానికి రూ. 30 లక్షలు, రుద్రవరం సెక్షన్ ఆఫీసు భవన నిర్మాణానికి రూ.21.5 లక్షలు విడుదల అయినట్లు తెలిపారు. ఆదేవిధంగా వార్త ఆఫీసు పరిధిలోని సబ్‌స్టేషన్‌లో కాంపౌండ్ నిర్మాణానికి రూ.14 లక్షలు శాంక్షన్ అయిందని ఏడీఈ తెలిపారు.

జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

- జిల్లా ప్రధాన న్యాయాధికారి కబర్ది

కర్నూలు లీగల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 8న జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులందరూ సద్వినియోగం చేసుకోవాలని కర్నూలు జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.కబర్ది, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి సూచించారు. ఈ మేరకు స్థానిక న్యాయ సేవా సదన్ భవన్‌లో వారు మాట్లాడుతూ జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు ఈ జాతీయ లోక్ అదాలత్‌ను ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఉన్న అన్నీ కోర్టులలో నిర్వహిస్తున్నామని తెలిపారు. వివిధ కోర్టులలో పెండింగ్‌లో ఉన్న రాజీపడదగిన సివిల్, క్రిమినల్ కేసులు, ప్రిలిటిగేషన్ కేసులను కూడా పరిష్కరించుకోవచ్చని చెప్పారు. ఈ లోక్ అదాలత్‌ల ద్వారా పరిష్కారమయ్యే కేసులపై ఎటువంటి అప్పీలు ఉండవని, కోర్టు ఫీజు కూడా ఉండదని తెలిపారు.


మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి కబర్ది

'నెలాఖరు వరకు ఆ రైళ్ల సర్వీసులు రద్దు'

మద్దికెర, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): కుంభమేళాకు వెళ్లిన ప్యాసింజర్ రైళ్లు తిరిగి గుంతకల్లు డివిజన్ చేరుకునేందుకు ఈ నెలాఖరు వరకు పడుతుందని, అప్పటి వరకు పలు రైళ్ల సర్వీసులను రద్దు చేసినట్లు డివిజన్ అధికారులు తెలిపారు. ఈ క్రమంలో తిరుపతి-కదిరిదేవర పల్లి (57405) ప్యాసింజర్ రద్దును ఈ నెల 30 వరకు పొడింగించినట్లు తెలిపారు. అదే విదంగా కదిరిదేవరపల్లి- తిరుపతి (57406) ప్యాసింజర్ ఈ నెల 31 వరకు, గుంతకల్లు-తిరుపతి (57404) ప్యాసింజర్ 30 వరకు, తిరుపతి-గుంతకల్లు (57403) ప్యాసింజర్ ఈ నెల 31 వరకు తిరగవని చెప్పారు. తిరుపతి-హుబ్లీ (57401) ప్యాసింజర్‌ను ఈ నెల 15 వరకు, హుబ్లి-తిరుపతి ప్యాసింజర్ రద్దును ఈ నెల 16 వరకు పొడిగించినట్లు వెల్లడించారు.

ఇంటి స్థలాలకు బడ్జెట్ కేటాయించాలి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ


మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

కర్నూలు న్యూసిటీ, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బడ్జెట్‌లో గృహ నిర్మాణ రంగానికి అధిక ప్రాధాన్యత ఇచ్చి నిధులు కేటాయించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. బుధవారం సీఆర్ భవన్‌లో జరిగిన సీపీఐ జిల్లా కార్యవర్గసమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల ముందు ప్రతిపక్షంలో ఉన్న కూటమి ప్రభుత్వం పేదప్రజల సొంత ఇంటికలను నెరవేరుస్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. అర్హులైన పేదల ప్రజలందరికీ గ్రామీణ ప్రాంతాల్లో మూడు, పట్టణ ప్రాంతాలలో రెండు సెంట్ల స్థలం ఇచ్చి నాలుగు లక్షల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లా అభివృద్ధి చెందాలంటే పెండింగ్ ప్రాజెక్టులను సత్వరమే పూర్తి చేయడం కోసం నిదులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యు లు పి. రామచంద్రయ్య, జిల్లా కార్యదర్శి బి. గిడ్డయ్య, రాష్ట్ర కార్యవర్గసభ్యుడు ఆవుల శేఖర్, లెనిన్‌బాబు, జిల్లా సహాయ కార్యదర్శి మునెప్ప పాల్గొన్నారు.

ఇరువర్గాల మధ్య ఘర్షణ

- ఎనిమిది మందికి గాయాలు

రుద్రవరం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): రుద్రవరంలో బుధవారం రాత్రి ఇరువర్గాలు కత్తులతో దాడులు చేసుకున్నట్లు ఎస్ఐ వరప్రసాద్ తెలిపారు. పాత కక్షల నేపథ్యంలోనే దాడులు చేసుకున్నారన్నారు. ఒక వర్గానికి చెందిన విజయుడు, కిషోర్, చిట్టిబాబు, వినోద్ కుమార్, మరో వర్గానికి చెందిన శేఖర్, కిరణ్, రవి, వెంకటేశ్వర్లు గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆటోల్లో, 108 వాహనంలో నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించి, వివరాలు సేకరించామని ఎస్ఐ తెలిపారు. బెస్త కాలనీలో అవాంఛనీయ సంఘటనలు చో టు చేసుకోకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ తెలి పారు.

చాగలమర్రిలో వ్యక్తి ఆత్మహత్య

చాగలమర్రి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ వైద్యశాల సమీపంలో కడప జిల్లా కానగూడుకు చెందిన అమీర్‌బాషా (45) బుధవారం పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అమీర్‌బాషా మద్యానికి బానిసయ్యాడు. మద్యం మత్తులో జీవితంపై విరక్తి చెంది పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కుటుం బీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పండుగ బిల్లులు పెండింగ్

చేపట్టిన పనులు	పెండింగ్ నిధులు
భవనాలు	రూ. 44,56,620
ప్లాంటేషన్	రూ. 14,26,501
సీసీ రోడ్లు	రూ.14,61,83,455
మినీ గోకులాలు	రూ. 42,78,291
ఇతర పనులకు	రూ. 22,31,198

- పల్లెల అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపం
- రూ.36 కోట్ల బిల్లులు ఇవ్వని ప్రభుత్వం
- పేరుకే పల్లె పండుగ హడావిడి


పంచలింగాల గ్రామంలో పల్లె పండుగలో భాగంగా రోడ్డు నిర్మాణం

కర్నూలు న్యూసిటీ, మార్చి 5(ఆంధ్రజ్యోతి): పల్లె పండుగ వారోత్సవాల పేరుతో ప్రభుత్వం చేసిన హడావిడి అంతా ఇంత కాదు. గత ఏడాది అక్టోబర్‌లో గ్రామాభివృద్ధి లక్ష్యంతో పనులు ప్రారంభించింది. ఈ పనుల బిల్లులు మాత్రం ఇప్పటికీ విడుదల చేయలేదు. పల్లెల్లో సీసీ రోడ్ల పనులు సంక్రాంతికి పండుగ నాటికి పూర్తి చేస్తామని కూటమి ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. పనులు వేగంగా పూర్తి చేయాలని అధికారులు సమీక్షలు నిర్వహించారు. బిల్లుల విడుదల గురించి పట్టించుకున్నపాపాన పోలేదు. గత ప్రభుత్వంలో కాంట్రాక్టర్లు చేసిన పనులకు బిల్లులు చెల్లించలేదని కూటమి ప్రభు త్వం విమర్శిస్తూ ఉంటుంది. కానీ అదే దారిలో తానూ ఉన్నట్లు గుర్తించడం లేదు.

పల్లె పండుగ పేరుతో గ్రామాల్లో రోడ్లు తదితర అభివృద్ధి పనులను ప్రభుత్వం చేపట్టింది. చేసిన పనులకు చేసినట్లుగా ఎం.బుక్‌లో రికార్డు చేసి బిల్లులను అప్‌లోడ్ చేశాక రెండు, మూడు రోజుల్లోనే బిల్లులు వస్తాయని చెప్పింది. ప్రతి వారం అప్పటికి చేసిన పనులకు బిల్లులు వస్తాయ ని ప్రకటించింది. ఇది ఒట్టి మాటేనని ఆచరణలో తేలిపోయింది. ప్రభుత్వ తీరు మీద కాంట్రాక్టర్లు తీవ్ర విమర్శలు ప్రకటిస్తున్నారు. ప్రతి వారం చేసిన పనులకు బిల్లులు పడతాయని మొదట్లో చెప్పారు. ఒకటి రెండు వారాలు తప్ప, ఆ తర్వాత బిల్లులు విడుదల చేయలేదు.

బకాయిలు రూ.36 కోట్లు

గ్రామాల సీసీ రోడ్ల పనులకు ఇప్పటి వరకు రూ.36 కోట్లు వరకు బకాయిలు ఉన్నట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. గత నెల 20 వరకు వివిధ పనులకు రూ.30.85 కోట్లు చెల్లించినట్లు అధికారులు చెబుతున్నా.. ఈ పదిరోజుల్లో ఈ పెండింగ్ రూ.36 కోట్లకు చేరినట్లు తెలుస్తోంది.



నాణ్యతకు తిలోదకాలు..

ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాలలో జరిగిన పనుల క్వాలిటీపై కూడా అధికారులు దృష్టి సారించలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. వేగంగా సీసీ రోడ్లు వేయడం, క్యూరింగ్ చేయకపోవడం వంటి సమస్యలు ఎన్నో ఉన్నాయి. రోడ్ల నాణ్యత పట్ల పీఆర్ క్వాలిటీ కంట్రోల్ విభాగం ఇంజనీర్లు పనుల పట్ల పూర్తి స్థాయిలో దృష్టి సారించనట్లు తెలుస్తోంది. కర్నూలు, ఆదోని డివిజన్లకు ఇద్దరు డీఈఈలు, నలుగురు ఏఈలు ఉన్న కారణంగా అన్ని పనులపై వీరు దృష్టిని కేంద్రీకరించలేకపోతున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. అయితే పూర్తి అయిన పనులకు వంద శాతం బిల్లుల చెల్లింపు జరగదని, మొత్తం బిల్లులో 15 శాతాన్ని డిపాజిట్‌గా ఉంచుకుని, క్వాలిటీ చెక్ చేసిన తరువాత డిపాజిట్‌గా ఉంచుకున్న మొత్తాన్ని విడుదల చేస్తామని ఇంజనీర్లు చెబుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



పెండింగ్ బిల్లుల విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. సీసీ రోడ్లు, ఇతర పనుల బిల్లులు త్వరలోనే విడుదల అవుతాయి. ఇప్పటి వరకు చేసిన పనులకు రూ.36 కోట్ల వరకు బిల్లులు అప్‌లోడ్ చేశాం. మిగిలిన రూ.5 కోట్ల పనులకు బిల్లులు అప్‌లోడ్ చేయాల్సి ఉంది. ఈ పని వెంటనే పూర్తి చేయాలని క్షేత్రస్థాయిలో విధులు నిర్వహిస్తున్న ఇంజనీర్లకు ఆదేశాలు జారీ చేశాం. ప్రస్తుతం జరుగుతున్న పనుల్లో క్వాలిటీకి రాజీ పడటడం లేదు. ఇంజనీరింగ్ అసిస్టెంట్లు జరుగుతున్న పనులను పర్యవేక్షిస్తున్నారు. **- వీ. రామచంద్రారెడ్డి, పీఆర్ ఎస్ఈ**

870 పనులకు రూ.70.18 కోట్లు

పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా ఉమ్మడి జిల్లాలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు రూ.70.18 కోట్లతో 870 పనులు చేపట్టారు. ఈ పనుల్లో ఇప్పటి వరకు 742 పనులు పూర్తి చేసినట్లు అధికారులు లెక్కలు చూపుతున్నారు. ఈ పనులను సంక్రాంతి పండుగ నాటికి పూర్తి చేయాలని నిర్ణీత గడువును కూడ విధించిన నేపథ్యంలో పల్లెల్లో కూటమి పార్టీలకు చెందిన నేతలు హడావిడిగా పనులు చేస్తున్నారు.

యూబీఐ కార్యాలయంలో మహిళా దినోత్సవం


ఉద్యోగులకు వైద్యపరీక్షలు

కర్నూలు కల్చరల్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): నగరంలోని యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా రీజనల్ కార్యాలయంలో బుధవారం అంతర్జాతీ య మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా కర్నూలు, నంద్యాలలో వైద్య పరీక్షల శిబిరం ఏర్పాటు చేసి, ఉద్యోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఓమ్ని హాస్పిటల్, స్మైల్ డెంటల్ కేర్, సుశీలా నేత్రాలయం ఆధ్వర్యంలో ఆయా విభాగాలకు చెందిన వైద్య నిపు ణులు బీపీ, షుగర్, థైరాయిడ్, దంత, నేత్ర పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా రీజనల్ కార్యాల యం రీజనల్ హెడ్ పి.నరసింహారావు, డిప్యూటీ రీజనల్ హెడ్స్ ఇ. సురేంద్ర గౌడ్, ఎన్వీ అనంత్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నరసింహారావు మాట్లాడుతూ తమ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించుకోవడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, బ్యాంకు ఖాతాదా రులు పాల్గొన్నారు.

క్రిటికల్ కేర్ బ్లాక్ తనిఖీ

కర్నూలు హాస్పిటల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సర్వజన వైద్యశాల న్యూడయోగ్నస్టిక్ బ్లాక్‌పై అంతస్థులో నిర్మిస్తున్న 50 పడకల క్రిటికల్ కేర్ యూనిట్ పనులను సూపరింటెండెంట్ డా.వి.వెంకటేశ్వర్లు బుధ వారం తనిఖీ చేశారు. ప్రధానమంత్రి ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మిషన్‌లో భాగంగా నిర్మిస్తున్న యూనిట్ పనులను వేగవంతం చేయాలని ఏపీఎంఎస్ఐ డీసీ డీఈ కరీముల్లాను ఆదేశించారు. నిర్మాణ పనులు ఎన్ని రోజుల్లో పూర్తి చేస్తారని అడిగారు. క్రిటికల్ కేర్ యూనిట్ ద్వారా తీవ్రమైన అనారోగ్య సమస్యలతో వచ్చే వారికి తక్షణం ఆరోగ్య సేవలు అందుతాయన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్లు డా.కే.సీతారామయ్య, డా.శ్రీరాములు, కేఎంసీ వైస్ ప్రిన్సిపాల్ డా.హరిచరణ్, ఎమర్జెన్సీ విభాగపు హెచ్‌వోడీ డా.రాంశివనాయక్, అడ్మినిస్ట్రేటర్ సింధు సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

వాహనాల వేలం వాయిదా

కర్నూలు అర్బన్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శాఖలో వివిధ నేరాల కింద పట్టుబడిన వాహనాల వేలం ప్రక్రియ వాయిదా పడింది. బుధవారం ఉదయం కర్నూలు ఎక్సైజ్ పోలిస్టేషన్ ఆవరణలో వేలం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. 19 ద్విచక్ర వాహనాలు, రెండు ఆటోలు, ఒక కారును వేలం వేసేందుకు ముందస్తుగా ప్రకటించారు. కానీ వేలం ప్రక్రియకు కేవలం 10 మంది మాత్రమే రావడంతో వాయిదా వేసినట్లు సీఐ చంద్రహాస్ తెలిపారు. తదుపరి వేలం ప్రక్రియను ఈనెల 12న నిర్వహిస్తామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ఆత్మకూరు, మార్చి 5(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు పట్టణంలోని పాత చెక్‌పోస్టు సమీపంలో గల కర్నూలు-గుంటూరు జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సతీష్ (23) అనే యువకుడు మృతి చెందాడు. పట్టణంలోని గొల్లపేటకు చెందిన హరి కుమారుడైన సతీష్ ఓ ప్రైవేట్ సంస్థలో కొరియర్ బాయ్‌గా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం 4గంటల సమయంలో కేజీ రోడ్డుపై బైక్‌పై వెళ్తు ఎదురుగా ఆర్టీసీ బస్సును ఓవర్ టెక్ చేసే ప్రయత్నం చేయగా వెనక నుంచి ఓ వాహనం ఢీకొట్టింది. పెద్దగా గాయాలు కానప్పటికీ యువకుడు అపస్మారక స్థితికి చేరుకున్నాడు. అక్కడున్న వారు వెంటనే యువకుడిని ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందాడు. ఎస్ఐ నారాయణరెడ్డి స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు అర్బన్ సీఐ రాము తెలిపారు.

జీజీహెచ్ పై అంతస్థు ఎక్కి గర్భిణి నిరసన

- ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన

కర్నూలు హాస్పిటల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జీజీహెచ్ మాతా శిశు సంరక్షణ కేంద్రం (గైనిక్ విభాగం) పై అంతస్థు ఎక్కి ఓ గర్భిణి నిరసన తెలపడం కలకలం రేపింది. కల్లూరు మండలం బస్తిపాడుకు చెందిన రేవతి రెండో కాన్పు కోసం పురిటి నొప్పులతో సోమవారం రాత్రి గైనిక్ వార్డుకు వచ్చింది. వైద్యులు పరీక్షలు నిర్వహించి బిడ్డ అడ్డం తిరిగిందని, లోపలే శిశువు మృతి చెందినట్లు నిర్ధారించారు. సోమవారం రాత్రి నుంచి మంగళవారం మధ్యాహ్నం వరకు గర్భిణి విపరీతమైన నొప్పిని భరించలేకపోయింది. గంటలు గడుస్తున్నా వైద్యులు పట్టించుకోకపోవడం, గర్భిణి తీవ్ర ఒత్తిడిని తట్టుకోలేక మనస్థాపానికి గురైంది. దీంతో పై అంతస్థు ఎక్కి నిరసన తెలిపింది. దీంతో గైనిక్ విభాగం ఎదుట గందరగోళం నెలకొంది. కొందరు యువకులు పరుగున పై అంతస్థుకు వెళ్లి గర్భిణిని కిందకు తీసుకురావడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటన జరిగిన గంట తర్వాత గర్భిణికి నార్మల్ డెలివరీ నిర్వహించారు. ఒత్తిడిని తట్టుకోలేక గర్భిణిపై అంతస్తు ఎక్కినట్లు తెలుస్తోంది. ఈ విషయంపై కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.కే.వెంకటేశ్వర్లును వివరణ కోరగా ఈ ఘటన తమ దృష్టికి రాలేదన్నారు.

వ్యవసాయ యాంత్రీకరణకు పచ్చజెండా

- రైతులకు తీపి కబురు
- జిల్లాకు 1,660 యూనిట్లు, నంద్యాల జిల్లాకు 1,635 యూనిట్లు
- రూ.5.60 కోట్ల సబ్సిడీ కేటాయింపు


స్ప్రేయర్ ద్వారా మందుల పిచికారీ



కర్నూలు అగ్రికల్చర్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎట్టకేలకు రైతుల మొర ఆలంకించింది. రైతులకు తీపి కబురు పంపింది. వ్యక్తిగతంగా పంటలకు అవసరమయ్యే సాగు యంత్ర పరికరాలను అందించేం దుకు ఉత్తర్వులు జారీ చేసింది. గత ఐదే ళ్లుగా జగన్ ప్రభుత్వం రైతులకు వ్యక్తిగ తంగా వ్యవసాయ పరికరాలు అందించకుండా సంఘాల పేరుతో యంత్రాలను అందజేసే కార్యక్ర మానికి తెర లేపారు. అయితే.. ఆ పార్టీ నేతలు, వారి అనుచరులకే యంత్ర పరికరాలను కట్టబెట్టారు. ప్రస్తుతం అవి ఎక్కడా కనిపించడం లేదు. యంత్ర పరికరాలకు రుణాలు అందజేసిన జిల్లా సహకార కేంద్ర బ్యాంకు అధికారులకు సంఘాల నుంచి రుణ బకాయిలు అందజే యడంలో చుక్కలు కనిపిస్తున్నాయి. రైతుల విజ్ఞప్తిని కూటమి ప్రభుత్వం పరిశీలించి వ్యక్తిగతంగా యంత్ర పరికరాలను అందించేందుకు శ్రీకారం చుట్టింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న ఆర్థిక సహకారంతో మరో వారంలోనే రైతులకు వ్యక్తిగతంగా వ్యవసాయ పరికరాల పంపిణీకి సంబంధించి చర్యలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ జేడీలకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఏ యంత్ర పరికరానికి ఎంత ధర ఉంటుందో ఆ పరికరానికి ప్రభుత్వం అందించే సబ్సిడీ ఎంతో నిబంధనలు విడుదలయ్యాయి. యంత్ర పరికరాల పంపిణీ ఏపీ స్టేట్ ఆగ్రో ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. కర్నూలు జిల్లాకు 1,660 యూనిట్లు, నంద్యాల జిల్లాకు 1635 యూనిట్లు మంజూరయ్యాయి. వీటి కొనుగోలుకు సంబంధించి ప్రభుత్వం రూ.5.60 కోట్లు రాయితీని మంజూరు చేసింది. రైతులకు అందిస్తున్న రాయితీలో 60 శాతం కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం భరిస్తున్నట్లు వ్యవసాయ శాఖ అధికార వర్గాలు తెలిపాయి. రైతులు ఆయా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో దరఖాస్తులు చేసుకునేలా ఏర్పాట్లు చేస్తున్నామనీ జేడీ వరలక్ష్మి తెలిపారు.

పత్తా లేని కస్టం హైరింగ్ కేంద్రాలు

గత ప్రభుత్వం కస్టం హైరింగ్ కేంద్రాల ద్వారా రైతుసంఘాలకు పరికరాలను అరకొరగా పంపిణీ చేసింది. వీటిని వైసీపీ నాయ కులు, వారి అనుచరులే కైవ సం చేసుకోవడంతో అర్హులైన రైతులకు యంత్ర పరికరాల వినియోగం దూరమైంది. రైతులు ముందుగా ఈ పరిక రాల మొత్తం సొమ్ము చెల్లిస్తే.. ఆ తర్వాత తీరిగ్గా డీబీటీ విధానంలో రైతు బృందాలకు రాయితీ సొమ్ము చెల్లించారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అటువంటి నిబంధనలకు స్వస్తి చెప్పి రైతువాటా సొమ్మును చెల్లిస్తే ప్రభుత్వం ఆయా కంపెనీలకు వెంటనే రాయితీ జమ చేసి యంత్ర పరికరాలు రైతులకు అందేలా చర్యలు తీసుకుంటుంది. దీనివల్ల కాలయాపన ఉండదని వ్యవసాయ అధికార వర్గాలు తెలిపాయి. ఐదెకరాల్లోపు భూములు ఉన్న ఎస్సీ, ఎస్టీ రైతులు మహిళలు, సన్న, చిన్నకారు రైతులకు వ్యవసాయ యంత్రీకరణ పరికరాల పంపిణీకి నిధులు మంజూరు అయ్యాయని, ఒక కుటుంబంలో ఒక రైతుకు మాత్రమే అందిస్తారని స్పష్టం చేస్తున్నారు. పరికరాలు పొందాలనుకునే రైతులు ఈ నెల 12 నుంచి రైతు సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవచ్చని జేడీ వరలక్ష్మి తెలిపారు. వ్యవసాయ సహాయకుడి లాగిన్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని, మండల వ్యవసాయాధికారి ఆమోదం పొందాక వ్యవసాయ శాఖ సహాయ సంచాల కులు లబ్ధిదారులకు పరికరాలు అందజేస్తామ న్నారు. అవసరమైన రైతులు వెంటనే దరఖాస్తులు చేసుకోవాలని జేడీ తెలిపారు.

నట్టేట మునిగిన పొగాకు రైతు

- క్వింటా రూ.15 వేలకు కొంటామని హామీ
- పంట విక్రయానికి తీసుకెళితే గ్రేడింగ్ పేరుతో తక్కువ ధర ఇస్తున్న వైనం
- లబోదిబోమంటున్న అన్నదాత

ఓర్వకల్లు, మార్చి 5(ఆంధ్రజ్యోతి): పొగాకు రైతులను ప్రైవేటు కంపెనీలు నట్టేట ముంచాయి. పొగాకు సాగు చేయండి.. దిగుబడి ఎలా ఉన్నా క్వింటా రూ.15వేలకు కొనుగోలు చేస్తామని రైతులను నమ్మించింది. కంపెనీలే రైతులకు విత్తనాలు సరఫరా చేయగా.. కొంత మంది రైతులు పొగాకు నారును కొనుగోలు చేశారు. అయితే.. విక్రయానికి వచ్చేసారి కంపెనీలు మాట మార్చి గ్రేడింగ్ ప్రకారం ధర వేస్తామంటూ మోసం చేయడంతో రైతులు లబోదిబోమంటున్నారు. మండలంలోని హుశేనాపురం, కొంతల పాడు, సోమయాజులపల్లె, శకునాల, తిప్పాయపల్లె, గుట్టపాడు, ఓర్వకల్లు, పూడిచెర్ల, నన్నూరు, లొద్దిపల్లె, ఉయ్యాలవాడ, ఉప్పలపాడు తదితర గ్రామా ల్లో 10వేలకు పైగా పొగాకు పంటను సాగు చేశారు. అయితే.. పొగాకు వీఎస్‌టీ, ఐటీసీ, జీపీఐ, బొమ్మిడాళ్ల, డక్కన్ ఇలా ఐదు కంపెనీలు పొగాకును కొనుగోలు చేస్తున్నారు. విత్తనం వేసేటప్పుడు దిగుబడి ఎలా ఉన్నా క్వింటం ధర రూ.15వేలు ధరను వేస్తామని రైతులను నమ్మించారు. కంపెనీలు రైతు లకు విత్తనాలు సరఫరా చేశారు. అయితే అవి కూడా నకిలీ విత్తనాలు పంపిణీ చేశారనీ రైతులు ఆరోపిస్తున్నారు. రైతులు సొంతంగా ఎకరన్నర రూ3వేల నుంచి రూ.3,500లకు కొనుగోలు చేశారు. ఎకరాకు రూ.70వేలు ఖర్చు పెట్టి పొగాకు సాగు చేశారు. తీరా దిగుబడి చూస్తే 6 నుంచి 10 క్వింటాళ్లు మాత్రమే వచ్చింది. అయితే కంపెనీ ఉద్యోగులు గ్రేడింగ్ వేసి రూ.7వేల నుంచి రూ.15వేల వరకు ధరను నిర్ణయించి కొనుగోలు చేస్తున్నారు. దీంతో రైతులు కంపెనీ ఉద్యోగులతో వాగ్వాదానికి దిగుతు న్నారు. పొగాకు తేమ ఉందని, తెచ్చిన పొగాకును కొనుగోలు చేయకుండా వెనక్కి పంపుతుండటంతో రైతులు మండిపడు తున్నారు. అయితే ఈ ఏడాది కూలీల రేట్లు పెరిగాయని, పురుషులకు రోజుకు రూ.800, మహిళలకు రూ.600 ఇస్తున్నామని, దీంతో కూలి రేట్లు పెరిగాయని కంపెనీలు రూ.20 వేలకు క్వింటానికి కొనుగోలు చేస్తే గిట్టుబాటు అవుతుందని, లేనిపక్షంలో కొనుగోలు కంపెనీ కేంద్రాల వద్ద నిరసనలు చేస్తామని హెచ్చరించారు. కంపెనీలు రైతుల బాధలు గుర్తించి మంచి ధర నిర్ణయించాలని పొగాకు రైతులు కోరుతున్నారు.


గోడౌన్‌లో విక్రయించేందుకు ఉంచిన పొగాకు

పంటను కొనుగోలు చేయాలి



మండలంలో రైతులు సాగు చేసిన ప్రతి పొగాకు పంటను కొనుగోలు చేయాలి. పొగాకును తేమ పేరుతో వెనక్కి పంపడం సరికాదు. కంపెనీలు ముందుగానే ధర ప్రకటించి కొనుగోలు చేస్తామని చెప్పి తర్వాత మాట మార్చి రేట్లు తగ్గించడం సరికాదు.

\- చిన్నతిరుపాలు, రైతు హుశేనాపురం

రైతులను ఆదుకోవాలి



గత ఏడాది మండలంలో పత్తి శనగ పంట ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేసేవారు. పొగాకు మంచి డిమాండ్ ఉండటంతో ఈ ఏడాది మండలంలో 10వేల ఎకరాల్లో సాగు చేశారు. ఆయా కంపెనీలు పొగాకు పంటను కొను గోలు చేసి రైతులను ఆదుకోవాలి.

\- వెంకటేశ్వర్లు, రైతు, కొంతలపాడు

క్వింటానికి రూ.20వేలు ఇవ్వాలి



మండలంలో ఈ ఏడాది పొగాకు పంటను విస్తారంగా సాగు చేశాం. అయితే.. పొగాకు కోసే సమయంలో కూలీలకు రేట్లు విపరీతంగా పెరిగాయి. కంపెనీలు గమనించి క్వింటం రూ.20వేలకు కొనుగోలు చేయాలి

\- మోహన్ రెడ్డి, రైతు, గుట్టపాడు

పెద్దాసుపత్రిలో అగ్నిప్రమాదం

- పొగతో గర్భిణులు, సహాయకుల అవస్థలు

కర్నూలు హాస్పిటల్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో బుధవారం మధ్యాహ్నం గైనిక్ విభాగం ఎదుట అగ్నిప్రమాదం జరిగింది. గైనిక్ విభాగం ఎదుట డైట్ కేంద్రం పక్కన ట్రాన్స్‌ఫార్మర్ దగ్గర మధ్యాహ్నం 12 గంటల సమయంలో మంటలు చెలరేగాయి. మెలమెల్లగా భారీ మంటలు ఎగిసిపడటం, పక్కనే ట్రాన్స్‌ఫార్మర్ ఉండటంతో గైనిక్ రోగులు, పీజీ విద్యార్థులు ఆందోళన చెందారు. గంట తర్వాత హెల్త్ ఇన్‌స్పెక్టర్ వచ్చి అప్రమత్తం చేయడంతో సెక్యూరిటీ, శానిటేషన్, ఫైర్, డైట్ సిబ్బంది బకెట్లతో నీటిని తెచ్చి మంటలను ఆర్పివేశారు. ఈ సమయంలో భారీ మంటలతో వచ్చిన పొగతో గైనిక్ విభాగంలో చికిత్స పొందుతున్న గర్భిణులు, బాలింతలు వారి బంధు వులు ఊపిరి ఆడక ఇబ్బంది పడ్డారు. సంఘటనా స్థలాన్ని హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ పి.సింధు సుబ్రహ్మణ్యం పరిశీలించారు. సిగరెట్ కాల్చి అక్కడ పడివేయడం వల్ల చెత్త అంటుకుని అగ్నిప్రమాదం జరిగినట్లు రోగులు అడ్మినిస్ట్రేటర్‌కు వివరించారు. అక్కడ పెరుగుతున్న చెట్లను తొలగించాలని ఆదేశించారు.

ఫైర్ సిబ్బంది నిర్లక్ష్యం: ఓ పక్క మంటలు వ్యాపిస్తుంటే.. ఫైర్ సిబ్బంది పైపుల ద్వారా నీటిని చల్లి ఆర్పే ప్రయత్నం చేశారు. కానీ రోడ్డు నుంచి ఘటన స్థలానికి కేవలం 15 మీటర్ల పైపు ఉండటంతో పైపు మధ్యలో నిలిచిపోయిందని, ఫైర్ సిబ్బంది 100 నుంచి 300 మీటర్ల వరకు పైపును సిద్ధం చేసుకోకుండా కేవలం 15 మీటర్ల పైపు ఉండటంపై అక్కడ ఉన్న రోగులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ఫైర్ సిబ్బంది సిలిండర్ ఫైడర్‌తో మంటలు ఆర్పించారు.


ఘటనా స్థలంలో కమ్ముకున్న పొగ, పక్కనే ట్రాన్స్‌ఫార్మర్

స్వామినాథన్ కమిషన్ సిఫారసులు అమలు చేయాలి


ధర్నా చేస్తున్న అఖిల పక్ష రైతు సంఘాల నాయకులు

కర్నూలు న్యూసిటీ, మార్చి 5(ఆంధ్రజ్యోతి): స్వామినాథన్ కమిషన్ సిఫారసులు అమలు చేయాలని అఖిల పక్ష రైతు సంఘాలు డిమాండ్ చేశాయి. అఖిలపక్ష రైతు సంఘాల పిలుపు మేరకు బుధవారం సుం దరయ్య కూడలిలో ధర్నా నిర్వహించారు. కార్యక్రమానికి రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేషులు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామక్రిష్ణ మాట్లాడుతూ అన్ని పంటలకు మద్దతు ధర ఇవ్వాలన్నారు. స్మార్ట్ మీటర్లు బిగించడం మానుకోవాలని హితవు పలికారు. సాగునీటి ప్రాజెక్టులకు తక్షణమే నిధులు కేటాయించాలన్నారు. అన్నదాత సుఖీభవ పేరుతో రైతుల ఖాతాల్లో రూ.20 వేలు జమచేస్తామని చెప్పి ఎన్నికల్లో ఓట్లు దండుకుని ఇప్పటి వరకు పైసా కూడ ఇవ్వకపోడం దారుణమన్నారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ నాయకులు వెంకటస్వామి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి అంజిబాబు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు లింగన్న, మహిళా సంఘం నాయకులు అరుణ, అలివేలమ్మ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధతో కిస్తీలు


దర్గాలో పూజలు చేస్తున్న భక్తులు

ఓర్వకల్లు, మార్చి 5(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన ఓర్వకల్లులో వెలసిన హజరత్ సయ్యద్ సుల్తాన్ మహమ్మద్ షాఖాద్రి ఉత్సవాల సందర్భంగా బుధవారం కిస్తీలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. వీటిని తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. స్వామివారికి గురువులు ఎస్ఎండీ నజరుల్లా షాఖాద్రి, ఎస్ఎండీ షఫిఉల్లా షాఖాద్రిలు పూజలు చేశారు. భక్తులు స్వామివారికి కాయకర్పూరాలు సమర్పించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ సునీల్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు. కేడీసీసీ మాజీ చైర్మన్ మల్లికార్జున రెడ్డి భక్తులకు అన్నదానం చేశారు.

కొనసాగుతున్న మహిళా సాధికారత వారోత్సవాలు

కర్నూలు క్రైం, మార్చి 5(ఆంధ్రజ్యోతి): మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా మహిళా సాధికారిత వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని ఆయా పోలీసుల ఆధ్వర్యంలో కళాశాలలు, పాఠశాలల్లో మహిళా విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. బుధవారం స్థానిక సెయింట్ జోసెఫ్ కాలేజీ విద్యార్థినులకు పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. మహిళా చట్టాలు, ఫోక్సో యాక్టు, సామాజిక మాధ్యమాలు సైబర్ క్రైమ్‌పై తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. మహిళాలు, చిన్నారులకు అత్యవసర సమయంలో సాయం కోసం హెల్ప్‌లైన్ నెంబర్లు, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, ఉమెన్ హెల్ప్‌లైన్ 181, పోలీస్ హెల్ప్‌లైన్ 100, 112 సైబర్ క్రైం హెల్ప్‌లైన్ 1930, పోలీస్ కంట్రోల్ రూమ్ వాట్సాప్ నెంబరు 7777877722లకు కాల్ చేసి పోలీసుల సాయం పొందాలని సూచించారు.

చెత్త నుంచి సంపదను సృష్టించాలి: డీఎల్‌పీవో

కోడుమూరు, మార్చి 5(ఆంధ్రజ్యోతి): చెత్త నుంచి సంపద సృష్టించా లని డీఎల్‌పీవో లక్ష్మీ అన్నారు. స్థానిక ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్‌లో కర్నూలు డివిజనల్‌లోని కోడుమూరు, గూడూరు, సి.బెళగల్, కృష్ణగిరి మండలాల పంచాయతీ కార్యదర్శులు, క్లాసు మిత్రాలకు బుధవారం సంపద తయారీ విధానంపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఇంటింటి నుంచి సేకరిం చిన తడి, పొడి చెత్తను వేరు చేసి వాటి నుంచి వర్మీ ఎరువులు తయారీపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచు భాగ్యరత్న, డీపీఆర్‌సీ ఆర్‌పీ పద్మావతి, ఈవోఆర్‌డీ మంజుల పంచాయతీ కార్యదర్శులు అజయ్ భాస్కర్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అన్న క్యాంటిన్ పరిశీలన

గూడూరు మార్చి 5(ఆంధ్రజ్యోతి): గూడూరులోని అన్న క్యాంటిన్‌లో భోజనం నాణ్యతను కమిషనర్ రమేష్ బాబు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అన్న క్యాంటిన్‌లో ప్రజలకు అందిస్తున్న భోజనం నాణ్యత, రుచి, శుచి, పరిసరాల శుభ్రత పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేసారు.


భోజనం నాణ్యతను పరిశీలిస్తున్న కమిషనర్

బడ్జెట్‌లో సంక్షేమానికి ప్రాధాన్యం: ఎమ్మెల్యే

కల్లూరు, మార్చి 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బడ్జెట్‌లో కూటమి ప్రభుత్వం సంక్షేమానికి ప్రాధాన్యం ఇచ్చిందని పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత అన్నారు. బుధవారం ఆమె మాట్లాడుతూ అన్నివర్గాల ప్రజలు ఆకట్టుకు నేలా సీఎం చంద్రబాబు నేతృత్వంలో జనరంజక బడ్జెట్ అందించారని అన్నారు. 95 కేంద్ర ప్రభుత్వ పథకాలను అమలు చేయకుండా బడ్జెట్‌ను దారిమళ్లించిన ఘనత వైసీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. కూటమి ప్రభుత్వం 2047 విజన్‌తో లక్ష్యా సాధనే ధ్యేయంగా బడ్జెట్ రూపకల్పన చేశారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసేవిధంగా కూట మి ప్రభుత్వం ముందడుగు వేస్తుందని గౌరుచరిత వివరించారు.

నేడు బీసీ రుణాలకు ఇంటర్వ్యూలు

గూడూరు, మార్చి 5(ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్ రుణాలకు కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు గురువారం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు నగర పంచాయతీ కమిషనర్ రమేష్‌బాబు తెలిపారు. బుధవారం గూడూరు నగర పంచాయతీ కార్యాలయంలో ఆయన మాట్లా డుతూ 20వార్డులకు సంబం ధించి బీసీ కార్పోరేషన్ రుణాల కోసం 361 మంది అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారన్నారు. ఈ నెల 6న గూడూరు నగర పంచాయతీ కార్యాలయంలో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. అభ్యర్థులు ఆన్‌లైన్ అప్లికేషన్‌తోపాటు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, తెల్ల రేషన్ కార్డు, ఆధార్ కార్డు, బ్యాంకు అకౌంట్, విద్యా అర్హత పత్రాలు ఒరిజినల్ తోపాటు ఒక సెట్ జిరాక్స్ పత్రాలు తీసుకొని రావాలని కోరారు.

మహిళలు పోరాటాలకు సిద్ధం కావాలి: ఐద్వా

కర్నూలు న్యూసిటీ, మార్చి 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై మహిళలు పోరాటాలకు సిద్ధం కావాలని ఐద్వా జిల్లా కార్య దర్శి అలివేలమ్మ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్క రించుకుని సమత ముద్రించిన ప్రత్యేక సంచికను బుధవారం కార్మిక కర్షక భవన్‌లో ఐద్వా నాయకులు విడుదల చేశారు. అలివేలమ్మ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం అంతర్జాతీయ మహిళ దినోత్సవం రోజు సభలు, సమావేశాలు నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షురాలు కె.అరుణ, నాయకులు బి.పద్మ, కుమారి, పీఎస్.సుజాత, టి.బాలలక్ష్మి, ఎస్.మాలన్ పాల్గొన్నారు.

ఎన్జీవో అసోసియేషన్ నుంచి నలుగురు తొలగింపు

కర్నూలు కలెక్టరేట్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): ఏపీ ఎన్జీవో అసోసియేషన్ జిల్లా కార్యవర్గం నుంచి నలుగురిని తొలగిస్తూ జిల్లా అధ్యక్షుడు వెంగల్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఫిబ్రవరి 20న జరిగిన కార్యవర్గ సమావేశంలో సంఘం వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్నారన్న ఆరోపణలపై జిల్లా కార్యదర్శి జవహర్‌లాల్, ఉపాధ్యక్షులు సాంబశివారెడ్డి, రమణ, జిల్లా కోశాధికారి భాస్కర్ నాయుడుల ను సస్పెండ్ చేస్తూ తీర్మానం చేశారు. అయినా వీరు సంఘానికి వ్యతిరేకంగా మరలా ప్రవర్తించడంతో క్రమశిక్షణ చర్యల్లో భాగంగా సంఘం నుంచి తొలగిస్తున్నట్లు తెలియజేశారు.

విద్యార్థులపై దాడిని ఖండిస్తున్నాం

కర్నూలు అర్బన్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని జాదవ్ పూర్ యూనివర్సిటీలో విద్యార్థులపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని ఎస్ఎఫ్ఐ వర్సిటీ కార్యదర్శి రామక్రిష్ణ అన్నారు. బుధవారం రాయలసీమ యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వెంటనే ఆ రాష్ట్ర విద్యాశాఖ మంత్రిని వెంటనే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు.

ఎమ్మెల్సీ ఆలపాటికి అభినందన


ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న గీతాంజలి నర్సింగ్ కాలేజీ చైర్మన్ పెరుగు విజయ్‌వర్ధన్ రెడ్డి

కర్నూలు హాస్పిటల్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): కృష్ణా, గుంటూరు ఎమ్మెల్సీ పట్టభద్రుల ఎన్నికల్లో గెలుపొందిన కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు ఏపీ నర్సింగ్ ఇన్‌స్టిట్యూట్స్ అసోసియే షన్ తరఫున గీతాంజలి, కిమ్స్ నర్సింగ్ కళాశాల చైర్మన్ పెరుగు విజయ్‌వర్ధన్ రెడ్డి విజయవాడలో కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన నర్సింగ్ ఇన్‌స్టిట్యూట్ ఎదుర్కొంటున్న సమస్యలను ఆలపాటి దృష్టికి తీసుకెళ్లారు. ఏదైనా భవిష్యత్తులో కాలేజీ యజమానుల ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని ఆలపాటి హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు.

బాబు పని తీరుకు పట్టం కట్టారు: తిక్కారెడ్డి

కర్నూలు అర్బన్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం గడిచిన 8 నెలల్లో చేసిన అభివృద్ధికి పట్టభద్రులు ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభ్యర్థులను గెలిపించారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి అన్నారు. బుధవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు అభివృద్ధి, సంక్షేమానికి పెద్ద పీట వేస్తున్నారన్నారు. ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, పేరాబత్తుల రాజశేఖర్ టీడీపీ అభ్యర్థులుగా అత్యధిక మెజార్టీతో గెలుపొందడం అభినందనీ యమన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సూపర్ సిక్స్ పథకాలను అన్ని ఒక్కొక్కటిగా అమలు చేస్తుంటే ప్రతిపక్ష నాయకులు జీర్ణించుకోలేక పోతున్నారన్నారు.

ఆలపాటి గెలుపునకు కృషి చేసిన వారికి కృతజ్ఞతలు : ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ గెలుపునకు కృషి చేసిన వారందరికీ కుడా చైర్మన్, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. కృష్ణ, గుంటూరు ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీ కూటమి అభ్యర్థిగా ఆలపాటికి అవకాశం పార్టీ కల్పించిందన్నారు. ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ అత్యధిక మెజార్టీతో గెలుపొందడం అభినందనీయమన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

ఓర్వకల్లు, మార్చి 5(ఆంధ్రజ్యోతి): విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు లభిస్తుందని ఎంపీడీవో శ్రీనివాసులు అన్నారు. బుధవారం ఓర్వకల్లులోని పొదుపులక్ష్మి ఐక్య సంఘం కార్యాలయంలో పోస్టర్లను విడుదల చేశారు. ఎంపీడీవో శ్రీనివాసులు మాట్లాడుతూ చదవడం, రాయడం, అంకెలు, మొబైల్ వాడకం గురించి తెలియజేశారు. ఏపీఎం వెంకట్రామిరెడ్డి, వలంటరీ టీచర్లు పాల్గొన్నారు.

ఆర్‌యూ అభివృద్ధికి కృషి చేయండి

కర్నూలు అర్బన్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివర్సిటీ అభివృద్ధికి కృషి చేయాలని ఉన్నత విద్యామండలి చైర్మన్ మధుమూర్తిని రాయలసీమ విద్యార్థి, యువజన సంఘాల జేఏసీ నాయకులు కోరారు. బుధవారం ఉన్నత విద్యామండలిలోని ఆయన చాంబర్లో కలిసిన ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రాగిరి చంద్రప్ప, బీసీ విద్యార్థి యువజన సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సూర్య ప్రకాష్‌లు కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్సిటీలో ఎన్నోఏళ్లుగా పనిచేస్తున్న బోధనేతర ఉద్యోగులకు టైం స్కేల్‌వర్తింప చేయాలని, జీతాలు పెంచాలని కోరారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

కర్నూలు ఎడ్యుకేషన్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సీఐ మన్సూరుద్దీన్ విద్యార్థులకు సూచించారు. ఎ.క్యాంపు షైఫర్ పార్మశీ కళాశాలలో విద్యార్థులకు రోడ్డు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. కళాశాల డైరెక్టర్ ఆదిమూలపు సతీష్, ప్రిన్సిపాల్ మహాలక్ష్మి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ వైస్ ప్రిన్సిపాల్ కాసర్ల సురేష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రామ్మోహన్‌రావుకు నివాళి

కర్నూలు రూరల్ మార్చి 5(ఆంధ్రజ్యోతి): కొత్తబస్టాండ్ సమీపంలో కర్నూలు-1డిపో గేట్ వద్ద ఏపీఎస్ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్ వ్యవస్థాపకుడు రాజీవ్‌రత్న రామ్మోహనరావు వర్ధంతి సభను బుధవారం ఆ యూనియన్ కర్నూలు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి ఎన్ఎంయూ జిల్లా అధ్యక్షుడు ఎన్ఆర్ నాయుడు అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా రాష్ట్ర కార్యదర్శి ఎన్ ఎండీ ఇస్మాయిల్ పాల్గొని రామ్మో హన్‌రావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఎన్ఎంయూ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పీఏ వలీ, ముఖ్య సలహాదారు ఉరుకుంద, డిపో కార్యదర్శులు ఇసాక్, ఎంఎస్‌బీరెడ్డి, సత్యనారాయణ పాల్గొన్నారు.

త్రీటౌన్ పోలీస్ స్టేషన్ తనిఖీ

కర్నూలు క్రైం, మార్చి 5(ఆంధ్రజ్యోతి): నగరంలోని త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ విక్రాంత్ పాటిల్ బుధవారం తనిఖీ చేశారు. అనంతరం స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. సీజ్ చేసిన వాహనాలను త్వరగా డిస్‌పోజ్ చేయాలన్నారు. స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు. ఎస్పీ వెంట డీఎస్పీ బాబు ప్రసాద్, త్రీటౌన్ సీఐ శేషయ్య, ఎస్ఐ మన్మధ విజయ్ ఉన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

కోడుమూరు, మార్చి 5(ఆంధ్రజ్యోతి): ప్రజలు దోమల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి నూకరాజు అన్నారు. స్థానిక రెండో హెల్త్ వెల్నెస్ సెంటర్‌లో ఫైలేరియా వ్యాధిగ్రస్తులకు బుధవారం ఆరోగ్య సూత్రాలను తెలియజేసి ప్రభుత్వం అందిం చే కిట్లను అందజేశారు. జిల్లా సహాయ మలేరియా అధికారి చంద్రశేఖర్, లోకేటెడ్ పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీమంత్‌మాదన్న, హెల్త్ సిబ్బంది, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సకాలంలో అద్దె చెల్లించండి

కర్నూలు స్పోర్ట్స్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): డీఎస్ఏ ఇండోర్ స్టేడియంలోని షాపింగ్ కాంప్లెక్స్ అద్దెదారులు సకాలంలో అద్దె చెల్లించాలని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు అన్నారు. ఇండోర్ స్టేడియంలో ఆయన కలెక్టర్ ఆదేశాల మేరకు షాపింగ్ యజమానులతో మాట్లాడారు.

ఏఎస్ఐపై దాడి కేసులో నిందితుల అరెస్టు


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న సీఐ

కర్నూలు క్రైం, మార్చి 5(ఆంధ్రజ్యోతి): త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో స్పెషల్ బ్రాంచ్ ఏఎస్ఐ మాధవరెడ్డిపై దాడి చేసిన కేసులో నలుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. గత నెల 27న చెక్ పోస్టు వద్ద మద్యం మత్తులో ఉన్న నలుగురు నిందితులు పుల్లయ్య (బళ్లారి చౌరస్తా తిలక్‌నగర్), యశ్వంత్ ఆచారి (ఎన్టీఆర్ నగర్), సాయి (గీతాముఖర్జీ నగర్), నవీన్ (సప్తగిరినగర్)లు ఏఎస్ఐపై దాడి చేశారు. దీంతో ఏఎస్ఐ తీవ్రంగా గాయపడ్డాడు. కేసు నమోదు చేసిన సీఐ శేషయ్య బుధవారం వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. నిందితుల్లో ఒకరు యశ్వంత్‌ఆచారి అనస్థీషియా టెక్నీషియన్‌గా పని చేస్తున్నారు.

రంజాన్ తోఫా ఎక్కడ?

కర్నూలు న్యూసిటీ, మార్చి 5(ఆంధ్రజ్యోతి): గతంలో టీడీపీ ప్రభు త్వంలో చంద్రన్న కానుక పేరుతో రంజాన్ తోఫా ఇచ్చేవారని, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వచ్చాక రంజాన్ తోఫా ఎక్కడుందని ఆవాజ్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఏ.సుభాన్ ప్రశ్నించారు. బుధవారం కమిటీ కార్యాల యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇక్బాల్ హుస్సేన్, ఎస్ఎండీ షరీఫ్ పాల్గొన్నారు.

ప్రత్యేక సెలవులపై హర్షం

కర్నూలు కలెక్టరేట్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రెండు రోజులపాటు ప్రత్యేక సెలవు మంజూరు చేసిన సందర్భంగా ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ నాయకులు కలెక్టర్ రంజిత్‌బాషాకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఏపీ ఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు వీసీహెచ్ వెంగల్‌రెడ్డి, ఇన్‌చార్జి జిల్లా కార్యదర్శి కేజీహెచ్ కృష్ణు డు, కర్నూలు నగర అధ్యక్ష, కార్యదర్శులు ఎంసీ కాశన్న, ఎం.రామకృష్ణ, ప్రభుత్వ నాలుగో తరగతి ఉద్యోగుల జిల్లా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మద్దిలేటి, భాస్కర్ రెడ్డి, ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ మహిళా విభాగం అధ్యక్షురాలు చందన, ఏపీ టైపిస్టు స్టెనోగ్రాఫర్ల అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శంకర్ నాయక్ పాల్గొన్నారు.

మహిళా ఉద్యమాలతోనే సమాజంలో మార్పు

కల్లూరు, మార్చి 5(ఆంధ్రజ్యోతి): మహిళా ఉద్యమాలతోనే సమాజం లో మార్పు వస్తుందని మహిళా సంఘం జిల్లా కార్యదర్శి అలివేలమ్మ అన్నారు. బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని శరీన్‌నగర్‌లోని ప్రగతి ఐక్య సంఘం (ఐద్వా) అధ్యక్షు రాలు ఉమా నివాసంలో సమావేశం నిర్వహించారు. దేశంలో మహిళలకు భద్రత కరువైందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలకు రక్షణ కల్పించడంతో ఘోరంగా విఫలమయ్యాయని విమర్శించారు. కార్యక్ర మంలో నాయకులు ధనలక్ష్మీ, పద్మ, శ్యామల, రేణుక పాల్గొన్నారు.

కబడ్డీ పోటీల విజేత ఎన్.కొంతలపాడు

ఓర్వకల్లు, మార్చి 5(ఆంధ్రజ్యోతి): ఓర్వకల్లులో హజరత్ సయ్యద్ సుల్తాన్ మహ్మద్ షాఖాద్రి ఉరుసు సందర్భంగా దాతల సహకారంతో నిర్వహించిన జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు బుధవారం ముగిశాయి. ఈ పోటీలను తిలకించేందుకు యువత, ప్రజలు భారీగా తరలివచ్చారు. మొదటి విజేతగా ఎన్.కొంతలపాడు జట్టు రూ.15 వేలను గెలుపొందగా.. దాతలు విష్ణువర్ధన్ రెడ్డి, రంగనాథగౌడు, శివకృష్ణా రెడ్డి, బందేనవాజ్ అందజేశారు. రెండో విజేతగా రాయలసీమ యూనివర్సిటీ నిలిచి రూ.10 వేల నగదును దాతల లక్ష్మీకాంతరెడ్డి, అన్వర్‌బాషాలు అందజేశారు. మూడో విజేతగా శకునాల జట్టు గెలుపొందగా.. రూ.5వేల నగదును దాత టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి అందజేశారు. నాలుగో విజేతగా కన్నమడకల గెలుపొందగా రూ.3వేల నగదును దాత ఏసేపు అందజేశారు.

● వాలీబాల్ పోటీల్లో గెలుపొందిన మొదటి విజేతకు రూ.5వేలు టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు మోహన్ రెడ్డి, రెండో విజేతకు రూ.3వేలు కమ్మరి తిరుమలేష్, మూడో విజేత రూ.2వేలు టీడీపీ బీసీ సెల్ అధ్యక్షుడు దాత అల్లాబాబు, నాలుగో విజేత రూ.1000 నగదును దాత రంగలక్ష్మమ్మ అందజేశారు. అలాగే ట్రాక్టర్స్ రివర్సు పందెంలో, స్లోమోటార్ సైకిల్ పోటీలు నిర్వహించారు. విజేతలకు దాతలు నగదు బహుమతులు అందజేశారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా జోసఫ్, జాకీర్ హుశేన్ వ్యవహరించారు. కార్యక్రమంలో గురువులు ఎస్ఎండీ నజరుల్లా షాఖాద్రి, ఎస్ఎండీ షఫీఉల్లా షాఖాద్రి, ఆర్గనైజర్లు, పెద్దయ్య, మద్దిలేటి, శేఖర్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి అల్లాబాబు పాల్గొన్నారు.

సర్పంచ్ తీరుతో 'ఉపాధి' కరువు

- ఉపాధి పనులకు తీర్మానం చేయని వైనం
- పనులు కల్పించాలని గణేకల్లులో కూలీల ఆందోళన


నిరసన తెలుపుతున్న ఉపాధి కూలీలు

గ్రామాభివృద్ధికి పాటు పడి గ్రామ ప్రజలు వలసలు వెళ్లకుండా నివారించాల్సిన సర్పంచ్ ఉపాధి పనులకు తీర్మానం ఇవ్వకుండా మోకా లడ్డుతున్నారు.

ఆదోని రూరల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఆదోని మండలం గణేకల్లు గ్రామంలో 800జాబ్ కార్డులు ఉన్నాయి. ప్రస్తుతం 8 గ్రూపులకు సంబంధించిన 400మంది ఉపాధి పనులకు వెళ్తున్నారు. గ్రామానికి వైసీపీకి చెందిన సర్పంచ్ బంగారమ్మ. ఆమె భర్త వైసీపీ నాయకుడు మల్లారెడ్డి గ్రామంలో రాజకీయం చేస్తున్నారు. ఉపాధి పనులకు మూడు వారాలుగా సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి తీర్మానం ఇవ్వకపోవడంతో కూలీలు పనులకు వెళ్లడం లేదు. కారణం గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంట్ల నియామకంలో అంతర్గత కుమ్ములాటతో వైసీపీ సర్పంచ్‌కు కూటమి మహిళా నాయకురాలు మద్దతు ఉండడంతో ఉపాధి పనులు నిలిచిపోయాయి. ఇప్పటికే గ్రామంలో చాలామంది వలస వెళ్లారని, వారు కూడ ఈ ఎండను తట్టుకోలేక ఇతర ప్రాంతాల నుంచి తిరిగి గ్రామానికి చేరుకుంటున్నారని, ఉన్న వారికి ఉపాధి పనులు కల్పించకపోవడం ఏంటని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎండాకాలంలో ఉపాధి పనులు కల్పించకుండా వర్షాకాలంలో కల్పిస్తారా? అని వారు ప్రశ్నిస్తున్నారు. ఏవైనా రాజకీయ వ్యవహారాలుంటే కూడా.. ఇట్లా వ్యవహరించకూడదని అంటున్నారు. ఉపాధి పనులు నిలిపి తమ కడుపులు కొట్టరాదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకొని ఉపాధి పనులు కల్పించాలన్నారు.



మూడు వారాలుగా పని లేదు

గణేకల్లు సర్పంచుకు చెందిన రెండు గ్రూపులకు మాత్రమే పోయిన వారం పనులు కల్పించారు. మాకు మూడు వారాలుగా పనులు కల్పించడం లేదు. మేము ఏం తిని బతకాలి? ఎండకాలం ఎక్కడ వెళ్ళి పనులు చేసుకోవాలి? **- మంగమ్మ, కూలీ**

పనులు ఆగిన మాట వాస్తవమే

గ్రామంలో సర్పంచ్, ఇతరులకు మధ్య అంతర్గత విభేదాల వలన ఉపాధి పనులు ఆగిన మాట వాస్తవమే. ఇకపై ఎలాంటి సమస్య రాకుండా గట్టి చర్యలు తీసుకుంటాం. నేటి నుంచే కూలీలకు ఉపాధి పనులు కల్పిస్తాం.
- కృష్ణమూర్తి, ఏపీవో, ఆదోని

9న కంటి వైద్య శిబిరం

ఆదోని టౌన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్‌కేడీ కాలనీలోని సాయి భారతీ పాఠశాలలో ఈనెల 9న ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్టు ఆవోపా అధ్యక్షుడు శ్రీనాథ్ గుప్తా, దాత నగేష్ తెలిపారు. బుధవారం మాట్లాడుతూ శాంతి రామ్ (నంద్యాల) ఆసుపత్రి ఆధ్వర్యంలో ఎన్టీర్ వైద్య సేవ (ఆరోగ్య శ్రీ) సహకారంతో పరీక్షలు చేసి, ఉచితంగా శస్త్ర చికిత్స చేస్తామని, రవాణా, భోజనం, మందుల ఖర్చులు కూడా ఆస్పత్రి వారే భరిస్తారని తెలిపారు. వివరాలకు సెల్ నంబర్ 9980269662లో సంప్రదించాలని కోరారు.

చట్టాలపై అవగాహన ఉండాలి


ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ సీఐ

తుగ్గలి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరికీ చట్టాలపై అవగాహన ఉండాలని పత్తికొండ ఎక్సైజ్ సీఐ విశ్వేశ్వరరావు పేర్కొన్నారు. బుధవారం తుగ్గలిలో ప్రజలకు అవగాహన కల్పించారు. సారా తయారీ, విక్రయం, అక్రమ మద్యం చట్టరీత్యా నేరమన్నారు. అతిక్రమిస్తే పీడీయాక్టు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎక్సైజ్ ఎస్ఐ సాయి ప్రవీణ్, సిబ్బంది సర్దార్ తదితరులు ఉన్నారు.

రైతులను ఆదుకోవాలి

ఆదోని టౌన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): గడ్డివాములు దగ్ధమైన రైతులను ఆదుకోవాలని కౌన్సిలర్ వెల్లాల లలితమ్మ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణ పొలిమేరలోని అమరావతి నగర్‌లో బాధిత రెతులు హనుమంతు, కోదండను పరామర్శించారు. గడ్డివా ములు పూర్తిగా కాలిపోవడంతో పశుగ్రాసం లేకుండా పోయిందని ఆవేదన వెలిబుచ్చారు. వెల్లాల మధుసూదన శర్మ, రాజా, మధు, పరుశురాం పాల్గొన్నారు.


గడ్డి వాములను పరిశీలిస్తున్న కౌన్సిలర్, బీజేపీ నాయకులు

గిట్టుబాటు ధర కల్పించాలి

దేవనకొండ, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేంద్రయ్య, సీపీఐ కార్యదర్శి నర్సారావ్ డిమాండ్ చేశారు. దేవనకొండలో మాట్లాడు తూ మిరప, వేరుశనగ, టమో టాకు గిట్టుబాటు ధర లేక నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్వామి నాథన్ కమీటి సిఫార్సు లను అమలు చేయాలన్నారు. ధరల స్థిరీకరణ చట్టాన్ని అమలు చేసి రైతులను ఆదుకొవాలన్నారు. అనంతరం రైతుల సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. కండప్ప, కృష్ణ, రవికుమార్ ఉన్నారు.


సభ్యత్వం ఇస్తున్న నాయకులు

వడదెబ్బకు గురి కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

జిల్లా నోడల్ అధికారి డా. రఘు


మాట్లాడుతున్న జిల్లా నోడల్ అధికారి డా. రఘు

పత్తికొండ టౌన్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): వేసవిలో ప్రజలు వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్త తీసుకోవాలని జిల్లా నోడల్ ఆఫీసర్ డా. రఘు అన్నారు. గురువారం పత్తికొండ పీహెచ్‌సీని తనిఖీ చేశారు. ఎండలు అధికంగా ఉన్నాయని, వడదెబ్బ తగిలితే ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. వైద్యాధికారి సుజాత, సిబ్బంది అరుణ, చాముండేశ్వరి ఉన్నారు.

వడదెబ్బపై అవగాహన కల్పించాలి

తుగ్గలి: ప్రజలు వడదెబ్బకు గురికాకుండా అవగాహన కల్పించాలని నోడల్ అధికారి రఘు సూచించారు. బుధవారం స్థానిక ప్రభుత్వ వైద్యశాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. వైద్యశాలకు వచ్చే రోగులకు చికిత్స చేసి, మందులు పంపిణీ చేయాలన్నారు. వైద్యంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

మద్దికెర, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): రైతులు మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలని వ్యవసాయ అధికారి రవి సూచించారు. బుధవారం మండలంలోని పెరవలి గ్రామం లో పొలంబడి నిర్వహించారు. పంటలకు తెగుళ్ల నివారణకు అధిక మోతాదులో క్రిమిసంహారక మందులు వాడకూడదన్నారు. రైతులు వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు తీసుకోవాలని తెలిపారు. విశిష్ట సంఖ్య నమోదు చేసుకోవాలని, ఇది తీసుకోకపోతే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంక్షేమ పథకాలు, పంటల బీమా వర్తించవని తెలిపారు.


పొలంబడి నిర్వహిస్తున్న ఏవో రవి, సిబ్బంది

చెత్త సేకరణతో గ్రామాల్లో పరిశుభ్రత

- వర్మి కంపోస్టుతో ఆదాయం : డీఎల్‌పీవో నూర్జహాన్


మాట్లాడుతున్న డీఎల్‌పీవో నూర్జహాన్

ఆదోని రూరల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): చెత్త సేకరణతో గ్రామాల్లో పరిశుభ్రత ఏర్పడుతుందని డీఎల్‌పీవో నూర్జహాన్ సూచించారు. బుధవారం మండలంలోని పెద్దహరివాణం ఘన వ్యర్థాల నిర్వాహణ కేంద్రంలో ఆదోని, కౌతాళం, పంచాయతీ కార్యదర్శు లకు, ఈవోఆర్‌డీలకు శిక్షణ ఇచ్చారు. గ్రామాల్లో తడి, పొడిచెత్తను వేర్వేరుగా సేకరించాలని కోరారు. ప్రజలు ఇంటి వద్దకు వచ్చే కార్మికులకు తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందించాలని సూచించారు. మండలంలో 23 గ్రామాల్లో షెడ్లను నిర్మించామని, మరో 17 నిర్మాణంలో ఉన్నాయ న్నారు. ఎంపీడీవో రాజేంద్రప్రసాద్, ఈవోపీఆర్డీ జనార్ధన్ పాల్గొన్నారు.

ఎట్టకేలకు స్పందించారు



మరుగు దొడ్డికి బిగించిన తలుపు

ఆదోని టౌన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): పురపాలక కార్యాలయంలో మరుగు దొడ్డికి ఎట్టకేలకు తలుపులు ఏర్పాటు చేశారు. ఫిబ్రవరి 24న ఆంధ్రజ్యోతిలో 'పూర్ పాలన' శీర్షికన కథనం ప్రచురితమైంది. ఇందుకు స్పందించిన అధికారులు విరిగిన తలుపు స్థానంలో కొత్తవి అమర్చారు. అధికారులు స్పందించడంపై కౌన్సిలర్ వైజీ బాలాజీ అభినందించారు.

సమస్యల పరిష్కారంలో ముందుండాలి

తుగ్గలి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు ముం దుండాలని ఎంపీపీ ఎర్రనాగప్ప, ఎంపీడీవో విశ్వమోహన్ సూచించారు. బుధవారం ఎంపీపీ ఎర్రనాగప్ప అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అధికా రులు తమ శాఖలకు సంబంధించిన నివేదిక లను చదివి వినిపించారు. రోజూ గ్రామాల్లో పర్యటించాలన్నారు. ఈవోఆర్‌డీ శ్రీహరి, వైద్యులు వెంకటేశ్వర్లు, ఏపీవో హేమసుందర్, ఏపీఎం రాధాకృష్ణ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ ఎర్రనాగప్ప

వార్డెన్లు హాస్టళ్లలో ఉండాలి


మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

ఆదోని, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): వార్డెన్లు హాస్టళ్లలో ఉండాలని, అప్పుడే విద్యార్థుల సమస్యలు తెలుస్తాయని ఈజేవైఎం నాయకులు పేర్కొన్నారు. బుధవారం జిల్లా ప్రధాన కార్యదర్శి అజయ్ కుమార్, సాదాపురం మండల అధ్యక్షుడు రవి శంకర్ మాట్లాడుతూ హాస్టల్ విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వార్డెన్లు రోజూ హాస్టళ్లలోనే ఉండేలా ఉన్నతాధికారులు ఆదేశాలు ఇవ్వాలని సూచాంచారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం విద్యార్థుల కోసం రూ.కోట్లు ఖర్చు చేస్తుంటే కొందరు వార్డెన్లతో కూటమికి చెడ్డపేరు వస్తోందన్నారు. నాయకులు నాగరాజు, శివ, నరసింహ, ఈశ్వర్, కాశీ, ఈరప్ప, భీమేష్, నరసింహరాజ్ పాల్గొన్నారు.

రేషన్ సక్రమంగా పంపిణీ చేయాలి

మద్దికెర, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు రేషన్‌ను సక్రమంగా పంపిణీ చేయాలని తహసీల్దార్ హుశేన్‌సాహెబ్ ఆదేశంచారు. బుధవారం కార్యాలయంలో డీలర్లతో సమావేశం నిర్వహించారు. తెల్లకార్డుదారులకు బియ్యం, చెక్కర, జొన్నలు కూడా అందించాలన్నారు. లబ్ధిదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. తూకాల్లో అవకతవకలు జరగకూడదన్నారు. డీటీ శ్రీదేవి ఉన్నారు.

కొండలను తవ్వి మట్టి తరలిస్తే కేసులు

- మైన్స్ అండ్ జియాలజి శాఖ జిల్లా సహాయ అధికారి రాజశేఖర్


తవ్వకాలు జరిగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారి

ఆలూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): కొండలను తవ్వి ఎర్రమట్టి తరలిస్తే కేసులు నమోదు చేయిస్తామని మైన్స్ అండ్ జియాలజి శాఖ జిల్లా సహాయ అధికారి రాజశేఖర్ హెచ్చరిం చారు. బుధవారం మండలంలోని హత్తిబెళగల్ సమీపంలోని కృష్ణాపురం కొండల్లో త్రవ్వకాలు జరిగిన ప్రాంతాన్ని స్థానిక రెవెన్యూ అధికారులతో కలసి పరిశీలించారు. మట్టి తరలింపును అడ్డుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తామని, రెవెన్యూ అధికారులు కూడా నిఘా ఉంచాలన్నారు. తవ్వకాలపై విచారిస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట రాయల్టీ అధికారి సాంబశివా రెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్ దిలీప్ కుమార్, ఆర్ఐ బసవన్న గౌడ్, వీఆర్‌వో అమర్‌నాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆధార్ నమోదు చేయించాలి

ఆలూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఆరేళ్లలోపు చిన్నారులకు ఆధార్ నమోదు చేయించాలని ఎంపీడీవో మహబూబ్ బాషా సూచించారు. బుధవారం కార్యాలయంలో అంగన్వాడీ వర్కర్‌లకు ఆధార్ నమోదుపై అవగాహన కల్పించారు. మండలంలో మొత్తం 2,700 మంది 6 ఏళ్ల లోపు పిల్లలు ఉండగా 1,200 మాత్రమే ఆధార్ నమోదు చేసుకున్నారని, మిగిలిన వారందరికీ నెల ఆఖరులోపు నమోదు చేయించాలన్నారు. ఇందుకు గ్రామ మహిళా పోలీసులు కూడా సహకరించాలన్నారు.

శిశు మరణాలు తగ్గించాలి


పొట్లపాడులో వైద్యసిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా నోడల్ అధికారి

దేవనకొండ, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): నవజాత శిశు మరణాలను తగ్గించాలని నోడల్ అధికారి డాక్టర్ రఘు సూచించారు. బుధవారం మండలంలోని పొట్లపాడులో చంద్రన్న సంచార చికిత్స కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. గర్భిణులు అనారోగ్యానికి గురైతే తక్షణమే స్పందించి మెరుగైన వైద్యం అందించాలన్నారు. రక్తహీనత, థైరాయిడ్, హెచ్ఐవీ, సిఫిలిస్ పరీక్షలు నిర్వహించాల న్నారు. వైద్యాధికారి కళ్యాణ్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పరీక్షల భయం వీడాలి

మద్దికెర, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థినులు పరీక్షల భయం వీడాలని మండల విద్యాధికారి రంగస్వామి సూచించారు. బుధవారం కస్తూర్బా పాఠశాలలో యూటీఎఫ్ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన కుండా కుటుంబం సహకారంతో విద్యార్థినులకు పరీక్ష సామగ్రి అందజేశారు. వందశాతం ఉత్తీర్ణత సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు పేరు తీసుకుని రావాలన్నారు. యూటీఎఫ్ మండల అధ్యక్షుడు ఎం.రంగన్న, విశ్వనాథ్, ప్రిన్సిపాల్ జ్యోతిరెడ్డి ఉన్నారు.

హోసూరులో ఉద్రిక్తత..

- హత్యకేసు నిందితుడిపై దాడికి యత్నం.. గ్రామంలో పోలీసు బందోబస్తు

పత్తికొండ, మార్చి5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హోసూరు గ్రామంలో బుధవారం రాత్రి ఉద్రిక్తత చోటుచేసుకుంది. వివరాల మేరకు.. గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు వాకిటి శ్రీనివాసులు గతంలో హత్యకు గురయ్యాడు. ఈ కేసుకు సంబంధించి గ్రామానికి చెందిన 6గురిని నిందితులుగా గుర్తించి పోలీసులు వారిని రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో నిందితులు బెయిల్‌పై విడుదలై ఇతర ప్రాంతాల్లో నివాసముంటున్నారు. అయితే నిందితులలో ఒకరైన హరిక్రిష్ణ బుధవారం రాత్రి గ్రామానికి వచ్చాడు. విషయం తెలుసుకున్న మృతుడు వాకిటి శ్రీనివాసులు అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ బైక్‌కు నిప్పు పెట్టేందుకు యత్నించారు. నిందితుడిపై దాడి చేసేందుకు సిద్ధమ య్యారు. విషయాన్ని గమనించిన వాకిటి శ్రీను కుటంబసభ్యులు వారించారు. అనం తరం దాడి చేసేందుకు యత్నించిన వారు అక్కడి నుంచి వెల్లిపోయారు. సమాచారం అందుకున్న సీఐ జయన్న సిబ్బందితో హుటాహుటిన గ్రామానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. గ్రామంలో నలుగురు సీఐలు, పోలీసులు 20 మంది దాకా బందోబస్తు నిర్వహిస్తున్నారు.

సారా నిర్మూలనపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి

వెల్దుర్తి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఎల్.తండాలో 'నవోదయం'లో భాగంగా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి బుధవారం నాటుసారా నిర్మూలన పై అవగాహన కల్పించారు. అసిస్టెంట్ కమిషనర్ హనుమంతరావు మాట్లాడుతూ సారా తయారీ, అమ్మకందారులపై పీడీ యాక్టు నమోదుచేస్తామని హెచ్చరించారు. ఎక్సైజ్ సూపరిండెంట్ సుధీర్‌బాబు మాట్లాడుతూ సారా తయారీ మానే వారికి జీవనాధారం కల్పిస్తామని తెలిపారు. ఏఈఎస్ రాజశేఖర్‌గౌడ్, ఈఎస్‌టీఎఫ్ ఇన్‌స్పెక్టర్ రాజేంద్రప్రసాద్, సీఐ మంజుల, ఎస్ఐ చంద్రమోహన్, ఏఎస్ఐ శివరామిరెడ్డి, వీఆర్వో క్రిష్ణమూరి పాల్గొన్నారు.

వైభవంగా వసంతోత్సవం

హాలహర్వి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గూళ్యంలోని గాది లింగేశ్వరస్వామి వసంతోత్సవం వైభవంగా నిర్వహించారు. దేవదాయ ఈవో రాధాకృష్ణ, పూజారులు నాగప్ప, మల్లన్న వేద పండితుల సమక్షంలో ఉత్సవమూర్తికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు మంగళహారతులతో రావడంతో సందడి మారింది. భక్తుల వాహనాల రద్దీతో కిలోమీటర్ల దూరంలో ట్రాఫిక్ స్తంభించింది. ఆంధ్ర, కర్ణాటక పోలీసులు ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. హాలహర్వి ఎస్సై చంద్ర, హొళగుంద ఎస్సై బాల నరసింహులు బందోబస్తు నిర్వహించారు.


మంగళహారతులతో వస్తున్న మహిళలు

యార్డుకు ఆదాయం సమకూర్చడమే లక్ష్యం

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

- ఆలూరు మార్కెట్ యార్డు కార్యదర్శి సునీత



ఆలూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మార్కెట్‌కు ఆదాయం సమకూర్చడమే లక్ష్యగా పనిచేస్తున్నట్లు కార్యదర్శి కె.సునీత తెలిపారు.

ప్రశ్న: మార్కెట్ యార్డు అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?
జవాబు: ఆలూరు మార్కెట్ యార్డు ముందుభాగంలో రూ.60 లక్షలతో 10 దుకాణాలు నిర్మించేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం, ఆవరణలో పెట్రోల్ బంక్ ఏర్పాటుకు ఉన్నతాధికారుల అనుమతి కోరాం. అలాగే ప్రతి బుధవారం పశువుల సంత నిర్వహిస్తున్నాం.

ప్రశ్న: మార్కెట్ యార్డు 2024-25 సంవత్సరానికి వసూళ్ల లక్ష్యం ఎంత?
జవాబు: ఏడాదికి రూ.1.20కోట్లు లక్ష్యం కాగా ఇప్పటివరకు రూ.65లక్షల ఆదాయాన్ని సమకూర్చాం.

ప్రశ్న: చెక్‌పోస్టులో సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి?
జవాబు: ఆలూరు, ఆస్పరిలో రెండు మార్కెట్ యార్డ్ చెక్ పోస్టులు ఉన్నాయి. అందులో 6 మంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ఆకస్మిక తనిఖీలు చేస్తున్నాం, చేతివాటం ప్రదర్శించినట్లు తేలిస్తే వారిని విధుల నుంచి తొలగిస్తాం.

ప్రశ్న: యార్డులో ఎన్ని గోదాంలు ఉన్నాయి?
జవాబు: మొత్తం 6 గోదాంలు ఉండగా, నాలుగు అద్దెకు ఇచ్చాం. మరో రెండు ఖాళీగా ఉన్నాయి.

ప్రశ్న: పత్తి కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపారా?
జవాబు: పత్తి సాగును బట్టి ఉన్నత అధికారులు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తారు. ఆలూరులో ఏర్పాటు చేసేందుకు అనుకూల పరిస్థితులు లేవు.

మంత్రాలయంలో చలువ పందిళ్ల ఏర్పాటు



శ్రీమఠం మ్యూజియం వద్ద ఏర్పాటు చేసిన చలువ పందిళ్లు

మంత్రాలయం, మార్చి 5(ఆంధ్రజ్యోతి): మంత్రాలయంలో ఎండలు మండుతున్న నేపథ్యంలో భక్తుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు ఆదేశాల మేరకు ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్లు వెంకటేష్‌జోషి, సురేష్ కోణాపూర్‌లు తడికెలతో తాత్కాలిక షెడ్లు ఏర్పాటుచేశారు. తుంగభద్ర కారిడార్ , మధ్వమార్గ్ కారిడార్, మ్యూజియం, పూర్వ పీఠాధిపతుల బృందావనాల దగ్గర తాత్కాలిక తడికెలతో చలువ పందిళ్లు ఏర్పాటుచేశారు. రాఘవేంద్ర స్వామి దర్శనార్థం వస్తున్న భక్తులు చలువ పందిళ్ల ద్వారా ఎండవేడి నుంచి ఉపశమనం పొందుతున్నారు. మఠం అధికారులు చలువ పందిళ్లు ఏర్పాటు చేయడంపై భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మఠం ఏఈ బద్రినాథ్, శ్రీహరి, గురురాజ్ దాస్ పాల్గొన్నారు.

కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలి: ఎమ్మెల్యే బీవీ

ఎమ్మిగనూరు, మార్చి 5(ఆంధ్రజ్యోతి): మదాసి, మదారి కురువలకు షెడ్యూల్డ్ కులాల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి కోరారు. బుధవారం అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ అనంతపురం, కర్నూలు జిల్లాల్లో మదాసి, మదారి కురువలు అత్యధికంగా ఉన్నారని జీవో ఎంఎస్‌నెంబర్ 25 చెబుతుందన్నారు. మదాసి, మదారి కురువలు ఎస్సీ ఆర్డీ1991లో షెడ్యూల్డ్ కులాలుగా గుర్తించారన్నారు. అదేవిధంగా 2014లో అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఎలాంటి షరతులు లేకుండా కుల ధృవీకరణ పత్రాలు ఇవ్వాలని చెప్పారన్నారు. ఇంతవరకు పత్రాలు ఇవ్వాలని ఇప్పటికైనా కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలని కోరారు.

ఎమ్మిగనూరులో కర్ణాటక పోలీసుల తనిఖీలు

ఎమ్మిగనూరు, మార్చి 5(ఆంధ్రజ్యోతి): నగల దొంగతనం కేసులో కర్ణాటక పోలీసులు ఎమ్మిగనూరు పట్టణంలోని బంగారు బజారులో తనిఖీ చేపట్టారు. స్థానికులు, పట్టణ పోలీసులు తెలిపిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కర్ణాటకలోని రాయచూరు జిల్లాలో దుండగులు ఓ మహిళలను హత్యచేసి ఆమె ఒంటిపై ఉన్న బంగారు, వెండి నగలను దోచుకున్నారు. ఈ ఘటనపై రాయచూరు పోలీసులు కేసు నమోదు చేసి హత్యకు పాల్పడిన దుండగులకు అదుపులోకి తీసుకొని దర్యాప్తు చేశారు. విచారణలో భాగంగా దుండగులు నగలను ఎక్కడెక్కడ అమ్మారో అన్న విచారణలో భాగంగా ఎమ్మిగనూరు పట్టణంలోని ఓ నగల వ్యాపారికి విక్రయించినట్లు తెలుసుకొని బుధవారం పట్టణంలోని బంగారు బజారులో ఉన్న నగల దుకాణంలో తనిఖీలు చేసి దోచుకున్న వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. ఈ విషయంపై పట్టణ సీఐ శ్రీనివాసులను వివరణ కోరగా రాయచూరులో జిల్లాలో జరిగిన ఘటనపై విచారణ నిమిత్తం రాయచూరు పోలీసులు వచ్చివెళ్లినట్లు తెలిపారు.

ఐదు ఆటోలు సీజ్.. కేసు నమోదు

మంత్రాలయం, మార్చి 5(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం పుణ్యక్షేత్రంలో రోడ్ల ఐదు ఆటోలపై కేసు నమోదు చేఇస సీజ్ చేసినట్లు మంత్రాలయం ఎస్ఐ శివాంజల్ తెలిపారు. బుధవారం రాఘవేంద్ర సర్కిల్ ప్రధాన రహదారిలో భక్తులకు ఇబ్బందులు కలిగిస్తున్న ఐదు ఆటోల రికార్డులు పరిశీలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మంత్రాలయంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఆటో డ్రైవర్లు రాఘవేంద్ర సర్కిల్ పక్కన మాత్రమే అనుమతి ఉంటుందని, లోపలికి అనుమతించమని తెలిపారు.

చర్చిల్లో ఉపవాస ప్రార్థనలు ప్రారంభం

మంత్రాలయం, మార్చి 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాధవరం, రాంపురం, రచ్చుమర్రి, వగరూరు, తుంగభద్ర, చెట్నహల్లి, మంత్రాలయం, సూగూరు, సింగరాజనహల్లి, నారాయణపురం గ్రామాల్లోని సీఎస్ఐ చర్చిల్లో ఉపవాస ప్రార్థనలు ప్రారంభమయ్యాయి. భస్మ బుధవారం పురస్కరించుకుని సీఎస్ఐ మంత్రాలయం డివిజనల్ ఛైర్మన్ రెవరెండ్ పాస్టర్ వేదనాయకం, జాన్‌వెస్లీ, రాజన్న, ఏఎస్ఐల ఆధ్వర్యంలో ఉపవాస ప్రార్థనలు చేశారు. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేసి గుడ్ ఫ్రైడే వరకు ఈ ప్రార్థనలు కొనసాగుతాయన్నారు. కార్యక్రమంలో సంఘ నిర్వాహకులు భూపతి, తిమ్మోతి, జగదీష్, వినోద్ కుమార్, దావీదు, డానియేల్, రాజు పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపదను సృష్టించాలి

గోనెగండ్ల, మార్చి 5(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ ఆంధ్ర.. స్వచ్ఛ దివస్ కింద సేకరించిన చెత్త నుంచి సంపదను సృష్టించాలని ఈవోఆర్డీ అనంతశయనా సూచించారు. బుధవారం గోనెగండ్లలో పంచాయతీ సిబ్బంది ఇంటింటికి వెళ్లి చెత్తను సేకరించారు. అనంతరం ఈవోఆర్డీ అనంతశయన మాట్లాడుతూ ఇళ్ల దగ్గర ఉన్న చెత్తను తీసుకువచ్చి వర్మీకంపోస్టు ఎరువును తయారు చేసి విక్రయించి, ఆయా పంచాయతీలకు ఆదాయం తీసుకువచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కార్యదర్శులను ఆదేశించారు.

కాటికాపరులను ప్రభుత్వం ఆదుకోవాలి

మంత్రాలయం, మార్చి 5(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లోని శ్మశానాల్లో గుంతలు తీసే కాటికాపరులను ప్రభుత్వం ఆదుకోవాలని కాటి కాపరుల సంఘం నాయకులు అనిల్, మారెప్ప, సురేష్ కోరారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ జీకే గురురాజరావును కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకులు అశోక్ పాల్గొన్నారు.



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న కాటికాపరుల సంఘం నాయకులు

ఆర్‌వోబీ నిర్మించేదెప్పుడో?

- కోసిగిలో రోజుకు వందకుపైగా రైళ్ల రాకపోకలు
- వేసవిలో అల్లాడిపోతున్న వాహనదారులు



కోసిగిలో రైల్వేగేటు పడటంతో ఎండలో వేచి ఉన్న వాహనదారులు

కోసిగి, మార్చి 5(ఆంధ్రజ్యోతి): సుమారు 80వేలకుపైగా జనాభా ఉన్న కోసిగి మండలంలో రైల్వే ఫ్లైఓవర్ లేక వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కోసిగి మీదుగా ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఉరుకుందకు వచ్చే వాహనాలు సైతం రోజుకు వేలాది వాహనాలు రోజు కోసిగి మీదుగా ప్రయాణాలు చేస్తున్నారు. కోసిగి రైల్వేగేటు పరిధిలో ఎక్స్‌ప్రెస్ రైళ్లు, ప్యాసింజర్లు, గూడ్స్ సుమారు వందకు పైగా రాకపోకలు సాగిస్తుంటాయి. ప్రతి అరగంటకు ఒకసారి గేటు పడుతుండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చెన్నై-ముంబై మెయిన్ రైల్వే లైన్ కావడంతో రైళ్ల సంఖ్య పెరగడంతో రైల్వేగేటు పడిన సమయంలో పెద్ద ఎత్తున వాహనాలు గేటు అవతల ఇవతల రెండు వైపులా సుమారు అరగంటసేపు వేచి ఉండాల్సి వస్తుంది. దీనికి తోడు వాహనదారులు ఎండ వేడిమికి పిల్లలు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారు. కోసిగి ఫ్లై ఓవర్ కలగా మారిందని, కూటమి ప్రభుత్వంలోనైనా ఫ్లైఓవర్ నిర్మిచాలని పలువురు వాహనదారులు కోరుతున్నారు.

తప్పులు లేకుండా రీసర్వే చేయండి: సబ్ కలెక్టర్



రీ సర్వే వివరాలను పరిశీలిస్తున్న ఆదోని సబ్ కలెక్టర్

కౌతాళం, మార్చి 5(ఆంధ్రజ్యోతి): తప్పులు లేకుండా రీ సర్వే చేయాలని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ఆదేశించారు. బుధవారం గుడికంబాలి గ్రామంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రీ సర్వేలో కౌతాళం మండలంలో గుడికంబాలి గ్రామాన్ని ఎంపిక చేసిందన్నారు. గ్రామంలో ఏరైతుకు ఎలాంటి నష్టం జరగకుండా పకడ్బందీగా రీసర్వేను చేపట్టాలని మండల రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఇప్పటి వరకు చేపట్టిన రీసర్వే వివరాలను మండల తహసీల్దార్ రజినీకాంత్ రెడ్డిని అడిగి తెలుసుకుని డివిజనల్ సర్వేయర్ వేణుసూర్యతో కలిసి రీసర్వే రికార్డులను పరిశీలించారు. గ్రామంలోని మొత్తం భూమిని సెక్టర్లుగా విభజించి పూర్తిగా చేస్తామన్నారు. వీరి వెంట తహసీల్దార్ రజినీకాంత్ రెడ్డి వీఆర్వో నాగార్జున, సర్వేయర్లు ఉన్నారు.

ఇసుక రీచ్‌ను తనిఖీ చేసిన సబ్ కలెక్టర్: ప్రభుత్వం అర్హులైన లబ్ధిదారులకు నిబంధనల మేరకు ఇసుకను సరఫరా చేస్తుందని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ అన్నారు. బుధవారం ఆయన మండల పరిధిలోని గుడికంబాలి ఇసుక రీచ్‌ను తనిఖీ చేశారు. రీచ్‌లలో ఉన్న ఇసుక రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబంధనల మేరకు రీచ్‌ల వద్ద ఇసుకను సరఫరా చేయాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు.

సకాలంలో రుణాలు చెల్లించాలి



మాట్లాడుతున్న డీజీఎం నాగిరెడ్డి

కోసిగి, మార్చి 5(ఆంధ్రజ్యోతి): ఆర్లబండ సహకార సంఘంలో రుణాలు పొందిన రైతులు సకాలంలో చెల్లించి సొసైటీ అభివృద్ధికి రైతులు సహకరించాలని డీజీఎం నాగిరెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రమైన కోసిగిలోని ఆర్లబండ సొసైటీ కార్యాలయంలో డీజీఎం నాగిరెడ్డి, బ్యాంకు మేనేజర్ మహబూబ్ బాషాలు రికార్డులను పరిశీలించారు. సీఈవో రవికుమార్ నుంచి సొసైటీలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆర్లబండ సహకార సంఘంలో 3,008 మంది సభ్యులు ఉన్నారని, 824 మంది రైతులు సొసైటీల్లో అప్పులు తీసుకున్నారన్నారు. అప్పులు తీసుకున్న రైతులు సకాలంలో అప్పులు చెల్లించి సొసైటీ అభివృద్ధికి సహకరించాలన్నారు. సమావేశంలో పీఏసీ విజయభాస్కర్, సూపర్‌వైజర్ ఇషాక్, ఆర్లబండ సహకార సంఘం సొసైటీ సిబ్బంది ఉన్నారు.

హద్దులు ఏర్పాటు చేయాలి



తహసీల్దార్‌కు సమస్యను విన్నవిస్తున్న హిందూ శ్మశాన వాటిక సభ్యులు

ఎమ్మిగనూరు రూరల్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కర్నూలు బైపాస్ రోడ్డులో ఉన్న హిందూ శ్మశాన వాటికకు హద్దులు ఏర్పాటు చేయాలని హిందూ శ్మశాన వాటిక సంఘం సభ్యుడు యాపిలయ్య కోరారు. బుధవారం సభ్యులు తహసీల్దార్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొంతకాలం గా హిందూ శ్మశాన వాటికకు హద్దులు ఏర్పాటు చేయాలని కోరుతున్నా ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. స్పందించిన తహసీల్దార్ శేషఫణి సమస్య తమ దృష్టికి వచ్చిందని వెంటనే పరిష్కరిస్తామన్నారు.

బోయలను ఎస్టీ జాబితా చేర్చాలి



డిప్యూటీ స్పీకర్‌కు వినతి పత్రం ఇస్తున్న జనసేన ఇన్‌చార్జి లక్ష్మన్న

మంత్రాలయం, మార్చి 5(ఆంధ్రజ్యోతి): బోయలు విద్య, ఉద్యోగ, సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో వెనుకబడి ఉన్నారని వీరిని ఎస్టీ జాబితాలో చేర్చాలని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి లక్ష్మన్న కోరారు. బుధవారం అమరావతిలో అసెంబ్లీ సమావేశాల అనంతరం డిప్యూటీ స్పీకర్ రఘురామరాజు, తాడేపల్లెగూడెం ఎమ్మెల్యే బొల్లిశెట్టి శ్రీనివాసులు, ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులును వేర్వేరు సమయాల్లో కలిసి వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 40 ఏళ్లుగా వాల్మీకి బోయల హక్కుల కోసం పోరాటం చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో దాదాపు 50 లక్షల మంది వాల్మీకులు ఉన్నారని, వారికి ఎటువంటి కులవృత్తి లేకపోవడంతో చాలా వెనుకబడి ఉన్నారని వాపోయారు. వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు అసెంబ్లీలో బిల్లు పాస్ చేసి పార్లమెంటులో ఆమోదించేలా సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చొరవ తీసుకునేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో వాల్మీకి నాయకులు జగ్గాపురం చిన్న ఈరన్న పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలి



గర్భిణులకు సూచనలిస్తున్న సూపర్‌వైజర్ కాత్యాయని

కోసిగి, మార్చి 5(ఆంధ్రజ్యోతి): మూడు సంవత్సరాల నుంచి ఐదేళ్ల పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ క్యాత్యాయని సూచించారు. బుధవారం కోసిగిలోని పదవ అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ టీచరు జ్యోతి ఆధ్వర్యంలో బాలింతలు, గర్భిణులకు పిల్లల సంరక్షణ, విద్యపై తల్లులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ క్యాత్యాయని మాట్లాడుతూ అంగన్‌వాడీల్లో చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యను అందిస్తారన్నారు. పిల్లలను ప్రతి నెలా బరువులు, ఎత్తులు చూపించాలని, ఏ సంవత్సరానికి ఎంత బరువు, ఎంత ఎత్తు ఉండాలో తెలుసుకోవాలని తల్లులకు సూచనలు చేశారు. పుట్టినప్పటి నుంచి ఐదేళ్లలోపు పిల్లలకు ఆధార్ తీయించాలన్నారు. సమావేశంలో అంగన్‌వాడీ టీచర్లు జ్యోతి, లూతమ్మ, వరలక్ష్మి, శైలజ, నాగలక్ష్మి, భీమలింగమ్మ, దేవి, నాగవేణి, లత, వెంకటమ్మలు ఉన్నారు.

పదిలో వంద శాతం ఉత్తీర్ణతకు ప్రణాళిక

గోనెగండ్ల, మార్చి 5(ఆంధ్రజ్యోతి): పదో తరగతి వార్షిక పరీక్షలు మార్చి 17 నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో పరీక్షకు హాజరైన ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించేందుకు గోనెగండ్లలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించారు. అందుకు కావలసిన ప్రణాళిక, ముందు జాగ్రత్తలు, సూచనలు సలహాల కసరత్తు ప్రారంభించారు. దీంతో విద్యార్థులు పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు. ప్రణాళికాబద్ధంగా ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నారు. ఉత్తమ ఫలితాలను సాధించేందుకు సులభ తరహాలో విద్యాబోధన చేస్తున్నారు. గోనెగండ్ల ఉన్నత పాఠశాలలో 216 పదవ తరగతి చదివే విద్యార్థులు ఉన్నారు. మండల వ్యాప్తంగా 650 మంది విద్యార్థులు పదవ తరగతి చదువుతున్నారు. మండలంలో మూడు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. జబ్లింగ్ పద్ధతితో పరీక్షలు నిర్వహిస్తారు. పాఠశాలలో పది విద్యార్థులు 10/10 సాధిస్తారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగభూషణం తెలుపుతున్నారు

ఎల్లెల్సీ నీరే దిక్కు

గోనెగండ్ల, మార్చి 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని గంజహళ్లి గ్రామంలో గురు, శుక్రవారాలలో జరుగుతున్న బడేసాహెబ్ ఉరుసుకు తాగునీటి సమస్య రాకుండా ఉండేందుకు గాను ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుం టున్నారు. ఎల్లెల్సీ నీటిని తీసుకువెళ్లేందుకు భక్తులు ఎద్దుల బండ్లు, ఆటోలు, ట్రాక్టర్లలో తరలివస్తున్నారు. గ్రామ పంచాయతీ సిబ్బంది ఉరుసులో భక్తులకు నీరుసౌకర్యం కోసం 20 ట్యాంకర్లు ఏర్పాటు చేసింది.



ఎల్లెల్సీలో నీటిని తీసుకువెళ్తున్న భక్తులు

వైభవంగా దేవర





రాళ్లదొడ్డి, గంగవరంలో కుంభాలతో తరలి వెళ్తున్న మహిళలు, కలశాలతో చిన్నారులు

ఎమ్మిగనూరు రూరల్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రాళ్లదొడ్డి, కడిమెట్ల గ్రామాల్లో దేవర ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి ఆయా గ్రామా ల్లో వెలసిన మారెమ్మవ్వ, సుంకులమ్మలకు అర్చకులు కుంకుమార్చన, పుష్పాభిషేకం, మహామంగళహారతి ఇచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం చిన్నారుల కలశాలతో మహిళలు కుంభాలతో అమ్మవార్లకు నైవేద్యాన్ని సమర్పించి మొక్కులను తీర్చుకున్నారు. దేవతామూర్తులను దర్శించుకునేందుకు ఆయా గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఉత్సవాల్లో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు బందోబస్తును ఏర్పాటు చేశారు.

నందవరం: మండలంలోని గంగవరం గ్రామంలో బుధవారం మారమ్మ దేవర ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఉదయం నుంచే గ్రామస్థులు కుంభాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకొని నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆడబిడ్డలకు సారె, చీరలతో పాటు పట్టుబట్టలు పెట్టారు. కార్యక్రమంలో ముగతి సర్పంచ్ విరుపాక్షిరెడ్డి, గంగవరం సర్పంచ్ శివన్న, ప్రహ్లాదరెడ్డి, వెంకట్రామిరెడ్డి, శంకర్‌రెడ్డి, జయరామిరెడ్డి, రాజారెడ్డి, నీలకంఠరెడ్డి, దస్తగిరి, నరసింహులు పాల్గొన్నారు.

మంత్రాలయం: మండలంలోని ఖగ్గల్లు గ్రామంలో 74 ఏళ్ల తర్వాత దేవమ్మ, మారెమ్మ దేవతల దేవర ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. మంగళవారం అర్ధరా త్రి నుంచి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలో ప్రతి ఇంటి నుంచి మంగళవాయిద్యాలు, తప్పెట్లు, డ్రమ్స్ మధ్య ఊరేగింపుతో వచ్చి నైవేద్యాలు సమర్పించారు. ముఖ్యఅతిథులుగా పాల్గొన్న టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు సీతారామిరెడ్డి, వైసీపీ మండల కన్వీనర్ గురెడ్డి భీమిరెడ్డి, మురళీధర్ రెడ్డిలకు గ్రామ దేవర కమిటీ నాయకులు సత్కరించారు. కార్యక్రమంలో చంద్రశేఖర్ రెడ్డి, చంద్ర, సురేంద్ర, హనుమంతు, ఈరన్న, రాఘవేంద్ర, హుశేని పాల్గొన్నారు.

ఈరన్న హుండీ ఆదాయం రూ.90 లక్షలు



హుండీ లెక్కింపులో పాల్గొన్న సిబ్బంది

కౌతాళం, మార్చి 5(ఆంధ్రజ్యోతి): ఉరుకుంద ఈరన్న స్వామి దేవస్థానంలో స్వామి వారికి భక్తులు సమర్పించిన కానుకలను బుధవారం ఆలయ డిప్యూటీ కమిషనర్, ఈవో విజయరాజు ఆధ్వర్యంలో లెక్కించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తులు స్వామి వారికి సమర్పించిన కానుకల హుండీని లెక్కించగా నగదురూపంలో రూ.90,16,666లు, బంగారం 13 గ్రాములు, వెండి 11.20కిలోలు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో హుండీ పర్యవేక్షణ అధికారి వెంకటేష్, ఆదోని గ్రూపు ఆలయ పర్యవేక్షులు, ఆలయ అధికారులు మల్లికార్జున, వెంకటేశ్వరరావు, దేవాలయపు ఉప ప్రధాన అర్చకులు మహదేవప్ప, అర్చకులు నాగరాజు స్వామి, శివన్న స్వామి యూనియన్ బ్యాంకు సిబ్బంది, ఆలయ అర్చక సిబ్బంది, దేవస్థానపు సిబ్బంది పాల్గొన్నారు.

సింగరాజనహళ్లిలో చోరీ

10 గ్రాముల బంగారు, రూ.75 వేల నగదు అపహరణ

మంత్రాలయం, మార్చి 5 ఆంధ్రజ్యోతి): మండలంలోని సింగరాజనహళ్లి గ్రామానికి చెందిన బోయ లక్ష్మీ అనే మహిళ ఇంట్లో చోరీ జరిగింది. ఈ సంఘటన మంగళవారం అర్ధరాత్రి జరిగింది. బాధితురాలు, మాధవరం హెడ్ కానిస్టేబుల్ వీరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. బోయ లక్ష్మీ తన ఐదుమంది కూతుళ్లతో పెద్దకడబూరు మండలంలో జరుగుతున్న గంగాభవానీ జాతరకు ఇంటికి తాళంవేసి వెళ్లింది. గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళం పగులగొట్టి బీరువా లో ఉన్న 10 గ్రాముల బంగారు, రూ.75వేలు నగదును అపహరించుకొని వెళ్లారు. బుధవారం ఇంటికి వచ్చి చూసేసరికి ఇంటి తాళం పగులగొట్టడం, బీరువా తెరిచి ఉండటం చూసి మాధవరం పోలీసులకు బుధవారం సమాచారం ఇచ్చింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తామని హెడ్ కానిస్టేబుల్ వీరేష్ తెలిపారు.



బీరువ పగలకొట్టిన దృశ్యం

న్యాయసుధ పరీక్షలో ఎనిమిది మంది విద్యార్థులు ఉత్తీర్ణత



ఉత్తీర్ణులైన విద్యార్థులతో పీఠాధిపతి

మంత్రాలయం, మార్చి 5(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గురు సార్వభౌమ సంస్కృత విద్యాపీఠంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే న్యాయసుధ పరీక్షలో ఎనిమిది మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. నాలుగు రోజుల నుంచి పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు, వ్యాసరాజమఠం స్వామీజీ విద్యావిజ య తీర్థులు ఆధ్వర్యంలో వివిధ రాష్ట్రాలకు చెందిన పండితుల మధ్య పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలో ఎనిమిది మంది విద్యార్థులు ఉత్తీర్ణులు అయ్యారు. విద్యార్థులను పీఠాధిపతి అభినందించారు.

మండుతున్న ఎండలు

తల్లడిల్లుతున్న మూగజీవాలు

గోనెగండ్ల, మార్చి 5(ఆంధ్రజ్యోతి): వేసవి ప్రారంభంలోనే 38 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు అవుతోంది. పొలాలు, కాలువ గట్టు వెంట మూగజీవాలు గ్రాసం కోసం తల్లడిల్లుతున్నాయి. మూగజీవాలు ఆకలి, దప్పికలతో మూగరోదన చేస్తున్నాయి. ఈ ఏడాది వర్షాలు అరకొ రగా పడటంతో పచ్చిగడ్డి కనిపించడం లేదు. పశువుల యజమానులు ఇళ్ల దగ్గర కూడా సరిపడ గ్రాసం, నీరు లభించడం లేదు. గోనెగండ్ల మండలంలో ఆవులు, ఎద్దులు, 29,473, బర్రెలు 13,327, గొర్రెలు, 1,75,979, మేకలు 26616 ఉన్నాయి. మండుటెండలో మూగజీవాలు తాగునీటి కోసం తాపత్రయ పడటం రైతుకు కన్నీలు తెప్పిస్తున్నాయి. బోర్ల దగ్గరకు మూగజీవాలను తీసుకెళ్తే బోరు యజమానులు తమ పంటలకు నీరు తక్కువ వస్తుందంటూ అసహనం వ్యక్తం చేస్తున్నారు.

పెరిగిన గ్రాసం ధర: ఈ ఏడాది గ్రాసం ధర విపరీతంగా పెరిగింది. ట్రాక్టర్ గ్రాసం రూ.15వేల నుంచి రూ. 18 వేల వరకు పలుకుతోంది. తుంగభద్ర, గాజులదిన్నె ప్రాజెక్టు దగ్గర వరి, వేరుశనగ పంటలు సాగు చేయకపోవడంతో ఈ ప్రాంతంలో గ్రాసం ధర విపరీతంగా పెరిగింది.

